ఆంధ్రజ్యోతి



వేరుశనగ రూ.6,377

- కనీస మద్దతు ధర ప్రకటన
- నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ : కలెక్టర్

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 4 : జిల్లాలో కనీస మద్దతు ధరతో వేరుశనగ సేకరణకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కొనుగోలు కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 4273 ఎకరాల్లో వేరుశనగ పంట సాగులో ఉన్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాల మేరకు క్వింటంకు రూ.6,377 కనీస మద్దతు ధర ప్రకటించినట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, 25వ తేదీ వరకు సీఎం యాప్, రైతు భరోసా కేంద్రాలలో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రం పరిధిలో కనీస మద్దతు ధర కన్నా తక్కువగా మార్కెట్‌లో ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, జిల్లా సహకార అధికారి సుధాభారతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ వైభోగం

- మూలస్థానేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మూలస్థానేశ్వరాలయంలో ధ్వజపటం ఎగరేస్తున్న పండితులు



సింహ వాహనంపై ఆదిదంపతులు



ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులకు పల్లకిసేవ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 4 : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో సోమవారం ఉదయం ధ్వజారోహణంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా మూలస్థానేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, శివపార్వతులకు పూజలు విశేష పూలంగిసేవలు జరిగాయి. ధ్వజారోహణం అనంతరం కోడి ముద్దలను సంతానం లేని మహిళలకు పంపిణీ చేశారు. సాయంత్రం విశేష అలంకార పూజలు, పూలంగి సేవలు జరిగాయి. రాత్రి సింహ వాహనంపై ఆదిదంపతులు కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్వరెడ్డి, ఈవో వేణుగోపాల్, ధర్మకర్తలు, ఉభయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఉదయం ధ్వజారోహణం, రాత్రి సింహవాహన సేవలు జరిగాయి. తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. అలాగే, ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక అభిషేకాలు, రాత్రి పూలంగిసేవ, పూజలు జరిగాయి.



విద్యుద్దీప వెలుగుల్లో మూలస్థానేశ్వర ఆలయం

నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణను ఏదోరకంగా కేసులో ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దాడులకు రకరకాల కారణాలు చూపి.. నారాయణను దోషిగా చిత్రీకరించే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. పన్ను ఎగ్గొట్టారనే సాకుతో సోమవారం పలువురు టీడీపీ నాయకులు, సానుభూతిపరులు, ఆడిటర్ల ఇళ్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాడులు కొనసాగాయి. ఎటువంటి సెర్చ్ వారెంట్ లేకుండా, నోటీసు ఇవ్వకుండా పెద్ద ఎత్తున పోలీసులు సోదాలు నిర్వహించడం రాజకీయంగా కలకలం రేపింది.

ట్రాన్స్‌పోర్టు పన్ను ఎగ్గొట్టారని అభియోగం

టీడీపీ నాయకులు, ఇతరుల ఇళ్లలో పోలీసుల సోదాలు

పన్ను కోసమా.. పైసల కోసమా!?

టీడీపీ నేత నారాయణ అల్లుడిపై కేసు నమోదు

రాజకీయ వర్గాల్లో కలకలం..

కక్ష సాధింపుగా ఆరోపణలు



స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణ విద్యాసంస్థల బస్సులకు పన్ను చెల్లింపులో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ రికార్డుల కోసం అంటూ సోమవారం నెల్లూరులో ఈ వ్యవహారానికి ఏమాత్రం సంబంధం లేని వారి ఇళ్లపై పోలీసులు దాడులు చేశారు. మధ్యాహ్నం దాకా జరిగిన సోదాల్లో లెక్కల్లోకి రాని రూ.1.81 కోట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. రాంజీనగర్‌లోని ఏల్చూరు వెంకట గిరీష్ ఇంట్లో రూ.1.06 కోట్లు, హరనాథపురంలోని బోయిళ్ల ప్రసాద్ ఇంట్లో రూ.20.50 లక్షలు, రామలింగాపురంలోని కోట గురుబ్రహ్మం నివాసంలో రూ.25.55 లక్షలు, చింతారెడ్డిపాలెంలోని నారాయణ స్టాఫ్ క్వార్టర్స్‌లోని ఓ ఇంట్లో రూ.29.45 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. అలానే టీడీపీ మహిళా నేత ముప్పాళ్ల విజేత నివాసంలో కూడా పోలీసులు సోదాలు చేశారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) బీ చందర్ ఫిర్యాదు మేరకు నారాయణ అల్లుడు పునీత్ కొత్తపపై బాలాజీ నగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.



నెల్లూరులో టీడీపీ నేత విజేత ఇంటి ముందు పోలీసులు

- డీటీసీ ఫిర్యాదుతోనే : ఎస్పీ

ఈ సోదాల వివరాలను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, డీటీసీ చందర్ విలేకరులకు వెల్లడించారు. 'డీటీసీ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా నారాయణ అల్లుడు పునీత్‌పై కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టాం. నారాయణ విద్యాసంస్థలకు అనుబంధంగా ఎన్‌స్పైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ అనే సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పునీత్ ఈ ఎన్‌స్పైరా మేనేజ్‌మెంట్ సంస్థకు, నారాయణ విద్యాసంస్థలకు డైరెక్టర్‌గా ఉన్నారు. గత జూన్‌లో నారాయణ సంస్థతో ఎన్‌స్పైరా 92 బస్సులు అద్దె రూపంలో సమకూర్చేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమం లో 92 బస్సుల కొనుగోలుకు ఎన్‌స్పైరా సంస్థ ధనలక్ష్మి ఆటో ఏజెన్సీస్ సంస్థకు రూ.20.68 కోట్లకు ఇం డెంట్ పెట్టింది. రూ.4.48 కోట్లు జీఎస్టీ కూడా చెల్లిం చింది. తర్వాత ఇదే కంపెనీ ఈ జీఎస్టీను క్లెయిమ్ చేసుకుంది. కానీ ఇన్‌వాయిస్ మాత్రం నారాయణ విద్యాసంస్థల పేరుతో తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ కో సం రవాణా శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకు నే సమయంలో డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి నారా యణ విద్యాసంస్థల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించా రు. నారాయణ విద్యాసంస్థలే ఈ బస్సులను కొన్న ట్లుగా రవాణా శాఖ అధికారులకు చూపించారు. ఆ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్న బస్సులకు ఆ సంస్థ నుంచి ఎన్‌స్పైరా సంస్థకు అద్దె చెల్లిస్తున్నారు. సాధారణంగా విద్యాసంస్థల బస్సులకు తక్కువ ట్యాక్స్ చెల్లిస్తారు. కానీ స్టేజ్ క్యారియర్ బస్సులకు ఎక్కువ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. గత జూన్ నుంచి ఈ 92 బస్సులకు రూ.22 లక్షలు ట్యాక్స్ కట్టారు. కానీ వాస్తవానికి రూ.10 కోట్లకుపైగా కట్టాలి. ఇలా ఫోర్జరీ డాక్యుమెంట్ల ద్వారా రవాణా శాఖను మోసం చేయడంపై విచారణ జరుపుతున్నాం. ఈ క్రమంలోనే పలువురు ఇళ్లల్లో సోదాలు నిర్వహించగా రూ.1.81 కోట్లు లెక్కలు లేని నగదును గుర్తించాం. దీనిని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తున్నాం. ఈ మొత్తానికి లెక్కలు చూపి తిరిగి తీసుకెళ్లవచ్చు' అని ఎస్పీ వెల్లడించారు.

- ఎన్నికల డబ్బుల కోసమేనా!?

రికార్డుల ఆధారంగా బాధ్యులపై నేరుగా కేసులు నమోదు చేసే అవకాశం ఉండగా, నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీకి ఏమాత్రం సంబంధం లేని వారి ఇళ్లలో సోదాలు చేశారనే ప్రశ్నకు పలు రకాల సమాధానాలు వినిపిస్తున్నాయి. ఎన్నికల డబ్బులు దొరుకుతాయనే ఉద్దేశంతోనే వీరి ఇళ్లలో సోదాలు చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం పొంగూరు నారాయణ ఎన్నికల కోసం వందల కోట్ల రూపాయలను పోగు చేసి నెల్లూరులో భద్రపరిచారంటూ అధికార పార్టీకి అనుకూల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నిధులను స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో స్కూలు బస్సుల రికార్డుల పేరుతో నారాయణకు పరిచయస్తులు, ఉద్యోగులు, సన్నిహితుల ఇళ్లపై దాడులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడుల్లో పెద్దగా నగదు దొరక్కపోవడంతో ప్లేటు మార్చి రవాణా పన్ను ఎగ్గొట్టారనే సాకు చూపించారని అనుకొంటున్నారు. ఇటీవల జరిగిన సంఘటన పై ఆరోపణలకు బలం చేకూర్చుతుంది.

- పోలీసు వాదనలో బలముందా!?

ఎన్‌స్పైయిరా, నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ రెండూ పొంగూరు నారాయణకు చెందిన వేర్వేరు సంస్థలు. పోలీసులు చేసిన అభియోగాల్లో ఏమాత్రం పసలేదని, వేధింపుల కోసం ఈ కారణాలను వెతుకున్నారని ఎడ్యుకేషన్ సొసైటీ ఆరోపిస్తోంది. ఏడాదిన్న ర క్రితం వరకు సొసైటీకి అవసరమైన బస్సులను సొసైటీ నిధులతోనే కొనుగోలు చేసింది. అయితే విద్యాసంస్థల విస్తరణ, పెరిగిన అవసరాల దృష్ట్యా అదనపు బస్సులు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇందుకు సరిపడా నిధులు సొసైటీలో లేని కారణంగా సిస్టర్ కన్‌సన్ అయిన ఎన్‌స్పైయిరా సంస్థ నిధులతో 92 బస్సులను కొనుగోలు చేసి, ఒక్కో బస్సుకు నెలకు రూ.20వేలు చొప్పున సొసైటీకి అద్దెకు ఇచ్చింది. ఎడ్యుకేషనల్ ట్రాన్స్‌పోర్టు యాక్ట్ ప్రకారం తప్పనిసరిగా ఆ విద్యాసంస్థ పేరు మీద వాహనం రిజిస్టర్ అయి ఉండాలి. దీని ప్రకారం ఎన్‌స్పైయిరా సంస్థ కొన్న 92 బస్సులను ఎడ్యుకేషన్ సొసైటీకి పదేళ్ల లీజుకు ఇవ్వడంతోపాటు ఎడ్యుకేషన్ ట్రాన్స్‌పోర్టు రూల్స్ ప్రకారం సొసైటీ పేరుతో రిజిస్టర్ చేయించింది. ఇందులో చట్ట వ్యతిరేకత ఎక్కడుందన్నది టీడీపీ నాయకులు, నారాయణ విద్యాసంస్థ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

- ఇక ప్రభుత్వానికి పన్ను ఎగ్గొట్టిందనే అభియోగాల విషయానికి వస్తే ఎడ్యుకేషన్ సొసైటీ చట్ట ప్రకారం రవాణా శాఖకు ఎంత టాక్స్ చెల్లించాలో అంత చెల్లిస్తూ వస్తోంది. చట్ట ప్రకారం బస్సులు ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో రిజిస్టర్ అయినప్పుడు, విద్యార్థుల రవాణాకే వినియోగిస్తున్నప్పుడు ఎడ్యుకేషన్ ట్రాన్స్‌పోర్టు రూల్స్ ప్రకారం ఒక సీటుకు రూ.150 పన్ను చెల్లిస్తారు కానీ ఆల్ ఇండియా పర్మిట్ కింద 3వేల పైచిలుకు పన్ను ఎందుకు చెల్లించాలనేది నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ వాదిస్తోంది. ఒకవేళ నిజంగా పన్ను చెల్లింపులో హెచ్చు తగ్గులు ఉన్నప్పుడు, నోటీసులు ఇచ్చి వివరణ కోరాలి. కానీ, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ఒక్కసారిగా దాడులు చేసి కేసులు నమోదు చేయడం ఖచ్చితంగా వేధింపుల్లో భాగమేనని ఎడ్యుకేషనల్ సొసైటీ ఉద్యోగులు, సభ్యులు అంటున్నారు.



విజేత నుంచి వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

సొసైటీ పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విద్యాసంస్థలకు నడుస్తున్న బస్సులన్నీ ఆ విద్యా సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్‌స్పైరా సంస్థనే బస్సులను కొనుగోలు చేసినా ఆ సంస్థతో నారాయణ విద్యాసంస్థలు ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. ఆ ఒప్పందం ప్రకారం రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. పలానా చట్టం ప్రకారం ట్యాక్స్ తక్కువ కడుతున్నారని నోటీసు ఇస్తే, దానిని పరిశీలించి నిజంగానే కట్టాల్సి ఉంటే కడతామని అన్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ట్యాక్స్ పేరుతో టీడీపీ నాయకులు, నారాయణ స్టాఫ్ ఇళ్లల్లో సోదాలు నిర్వహించడం దారుణమన్నారు. రెచ్చగొట్టేకొద్దీ నారాయణ ఇంకా కసిగా పని చేస్తారని, రానున్న ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డికి దారుణ ఓటమి ఖాయమని వ్యాఖ్యానించారు.

- విజయభాస్కర్‌రెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం



సోదాల వివరాలు వెల్లడిస్తున్న కోటంరెడ్డి, పక్కన విజయభాస్కరరెడ్డి తదితరులు

వైసీపీ బెదిరింపులకు భయపడం : కోటంరెడ్డి

టీడీపీ నేతల ఇళ్లలో దాడులు చేస్తూ భయపెట్టాలని చూస్తున్నారని, వైసీపీ ప్రభుత్వ బుడ్డ బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రాత్రి నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్సులకు పన్ను చెల్లించలేదన్న సాకుతో టీడీపీ నేతలు, వ్యాపారులు, ఆడిటర్ల ఇళ్లల్లో దాడులు చేయడం దుర్మార్గమని ఖండించారు. ఐపీఎస్ అధికారులు కొల్లి రఘురామిరెడ్డి, సీతారామాంజనేయుల ఆదేశాలతో కొందరు పోలీసులు దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో ఇద్దరు పోలీసు అధికారులు వైసీపీ కండువాలు వేసుకొన్నట్లు ప్రవర్తిస్తున్నారని, వారిద్దరి జాతకాలను త్వరలో బట్టబయలు చేస్తానని ప్రకటించారు.



విజేతను పరామర్శిస్తున్న అబ్దుల్ అజీజ్

పోలీసుల తీరుపై ఆగ్రహం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 4: తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల విజేత నివాసంలో పోలీసుల సోదాలను టీడీపీ, జనసేన నాయకులు ఖండించారు. సోమవారం రాంజీనగర్‌లోని విజేత నివాసానికి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ చేరుకొని ఆమెను పరామర్శించారు. టీడీపీ నాయకులను పోలీసుల ద్వారా ఎన్ని భయభ్రాంతులకు గురి చేసినా భయపడేది లేదని, మరో రెండు నెలల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రజా ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు.

- టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, విజేతను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం చెప్పిందని అధికారులు గుడ్డిగా చేయకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అని తెలిపారు.
- గుప్తాపార్కు సెంటర్‌లో టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో వైసీపీ భూస్థాపితం అయ్యే పరిస్థితి చూసి తాడేపల్లి కొంపలో జగన్‌కు తడిసి పోతోందన్నారు.
- జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ విలేకరులతో మాట్లాడుతూ నారాయణపై మూడు నెలల్లో మూడుసార్లు ప్రభుత్వం నుంచి రైడ్‌లు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా నారాయణ విజయాన్ని ఆపలేరన్నారు.

నారాయణే లక్ష్యంగా రాజకీయ కక్ష సాధింపు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం) : టీడీపీ నేత పొంగూరు నారాయణే లక్ష్యంగా రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. టీడీపీ నేతల ఇళ్లలో పోలీసులు దాడులు నిర్వహించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు మహిళా నేత విజేతరెడ్డి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ విజేత ఇంట్లోకి పోలీసులు చొరబడి కుటుంబ సభ్యులకు భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రావటం ఖాయమని, తమ టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే ఎవరినీ విడిచి పెట్టమని హెచ్చరించారు. అనంతరం 5వ డివిజన్‌లో బాబూష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి నారాయణను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు నెల్లూరు పర్యటనతో తాడేపల్లి ప్యాలెస్ వణికిపోతోందని ఎద్దేవా చేశారు. ఆయన వెంట టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, వెంకారెడ్డి, దర్శి ప్రసాద్, శశికుమార్, బాలిరెడ్డి, గంగాధర్, కరీముల్లా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న ధరలు

పెరిగిన పొగాకు దిగుబడులు

ఆశల పల్లకిలో రైతులు

వలేటివారిపాలెం, మార్చి 4 : కర్ణాటకలో పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో మన రాష్ట్రంలో కూడా ధరలు బాగుండవచ్చని రైతుల ఆశాభావంతో ఉన్నారు. కర్ణాటకలో 100 మిలియన్ కిలోల అమ్మకాలకు అనుమతులు ఇవ్వగా, ఇప్పటి వరకు 80 మిలియన్ కిలోల అమ్మకాలు మాత్రమే జరిగాయని బోర్డు అధికారులు తెలిపారు. మరో నాలుగైదు మిలియన్ కిలోల పొగాకు రైతుల వద్ద ఉండవచ్చని వారు చెబుతున్నారు. ఈ నెలాఖరుకు కర్ణాటకలో అమ్మకాలు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ రాష్ట్రంలో ఇప్పటి వరకు సరాసరిన ధర కిలో రూ.249 పలికింది. మీడియం లోగ్రేడ్ కూడా కిలోకి రూ.230 ధర లభించింది. అక్కడ వంద మిలియన్ కిలోలకు అనుమ తులు ఇచ్చినా, వాతావరణం అనుకూలించకపోవడంతో ఇప్పటి వరకు 80 మిలియన్ కిలోల దిగిబడి మాత్రమే వచ్చింది. ఈ పరిణామాలన్నీ రాష్ట్రంలోని రైతులను ఊరిస్తున్నాయి.

- భారీగా దిగుబడులు

ఈ ఏడాది వలేటివారిపాలెం మండలంలో వాతావరణం అనుకూలించక పొగాకు నాట్లు ఆలస్యమయ్యాయి. పలు గ్రామాల్లో రెండు సార్లు నాట్లు వేశారు. వర్షాలు లేకపోయినా రైతులు వాగులు, వంకలు, బోర్ల ద్వారా వ్యయప్రయాసల కోర్చి పొగాకు తోటలను బాగా పెంచారు. దీంతో దిగుబడి కూడా బాగా వచ్చింది. సరాసరిన నల్లరేగడి నేలలో ఎకరాకు 10 క్వింటాళ్లు, ఎర్రరేగడి నేలల్లో ఎకరాకు 8 క్వింటాళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పొగాకు క్యూరింగ్ దశలో ఉంది. ఈ ఏడాది రాష్ట్రంలో 142 మిలియన్ కిలోలకు అనుమతులు ఇచ్చారు. ఎర్రరేగడి నేలలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లు, నల్లరేగడి పొలాల్లో 35.50 క్వింటాళ్లకు అనుమతులు ఇచ్చారు. అయితే కందుకూరు 2వ వేలం కేంద్రం పరిధిలోని గ్రామాల్లో అధికారికంగా 17,258 ఎకరాల్లో పొగాకు నాట్లు వేశారు అనధికారికంగా మరో 2,000 ఎకరాల లో నాట్లు వేసినట్లు అంచనా. దీంతో దిగుబడి కూడా భారీగా పెరిగింది. బ్యారన్‌కు 35 క్వింటాళ్ల వరకూ బోర్డు అనుమతించింది. దీనిపై 10 శాతం అపరాధ రుసుం లేకుండా అదనంగా అమ్ముకోవచ్చు. అంతకన్నా ఎక్కువగా ఉత్పత్తి అయితే అపరాధ రుసుం తప్పదు. రెండేళ్లుగా ధరలు బాగుండటంతో ఈ ఏడాది రైతులు సాగు విస్తీర్ణం పెంచారు. మొత్తానికి ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి.



సోమశిలలో 15.538 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 4 : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి జలాశయంలో 15.538 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

గూడు కల్పించండి సారూ!

పక్షవాతంతో సర్వం కోల్పోయిన తనకు గూడు కల్పించి ఆదుకోవాలని బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సుబ్రహ్మణ్యం అధికారులను వేడుకున్నాడు. తన భార్య సమాధానమ్మతో కలిసి కలెక్టరేట్‌లోని 'స్పందన' కార్యక్రమానికి విచ్చేసిన ఆయన డీఆర్వో లవన్న ఎదుట తన గోడును వెల్లబుచ్చుకున్నారు. దీంతో స్పందించిన డీఆర్వో సిఫారసుతో బాధితులు బుచ్చి తహసీల్దారు వద్దకు వెళ్లారు. తాను పరిశీలించి నివేదిక పంపుతానని తహసీల్దారు చెప్పడంతో 90 రోజుల్లో మంజూరు చేసే ఇంటి స్థలం కోసం రెండేళ్లుగా దరఖాస్తు చేసుకుంటున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన చెందారు. ఈ కాలంలో ఆరుగురు తహసీల్దార్లుగా మారారని, తమకు ఇంటి స్థలం మాత్రం మంజూరు కాలేదన్నారు. సమాధానమ్మ మాట్లాడుతూ అంబేద్కర్‌నగర్‌లో సొంతిల్లు అమ్మి తనభర్తకు వైద్యం చేయించానని, ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నట్లు తెలిపారు. పైసా సంపాదనలేక, అద్దె కూడా చెల్లించలేని తమకు ఇంటి స్థలం మంజూరు చేయాలని వేడుకుంది.

- బుచ్చిరెడ్డిపాళెం



డీఆర్వోకు మొరపెట్టుకుంటున్న సుబ్రహ్మణ్యం దంపతులు



కలెక్టరేట్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

వీవోఏలకు 'కాలపరిమితి' వద్దే వద్దు!

ఏపీ వెలుగు వీవోఏల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'స్పందన'లో కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అంతకముందు కలెక్టరేట్‌లో వీవోఏలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ వీవోఏలకు హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, స్వావలంబన నగదును తిరిగి సభ్యులకు చెల్లించాలని కోరారు. గ్రామ సంఘాల నుంచి చెల్లించాల్సిన రూ.2వేల బకాయిలతోపాటు గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని తెలిపారు. పొదుపు మహిళలకు రూ. 20 లక్షల వరకు సున్నా వడ్డీతో రుణాలు ఇవ్వాలన్నారు.

- నెల్లూరు (వైద్యం)

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట్రావు

విడవలూరు, మార్చి 4: ఉపాధిహామీ పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకట్రావు అన్నారు. 2022-23 సంవత్సరానికి గాను మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం బహిరంగ విచారణ జరిగింది. ఈ సందర్భంగా డ్వామా పీడీ వెంకట్రావు గత వారం రోజులుగా గ్రామాల్లో తనిఖీలు చేసిన డీఆర్పీలు అందజేసిన నివేదిక మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లను విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతేడాది జరిగిన పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు సంతకాలు లేకుండా బిల్లులు డ్రా చేసుకున్నట్లు గుర్తించామన్నారు. అటువంటి వారికి జరిమానా కింద రూ. 24,718, ఎస్ఎస్ఏ కింద చేసిన పనులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రికార్డులు అందచెయ్యనందుకు రూ.4వేలు, ఫైలింగ్ చేసినందుకు బిల్లులు ఇవ్వనందున సుమారు రూ.7వేలు రికవరీకి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదేవిధంగా నేమ్‌బోర్డులు మంజూరైన రూ. 3,88లక్షలు సీఆర్డీ అకౌంట్‌కి



ఉపాధి హామీ పనులపై విచారణ చేస్తున్న డ్వామా పీడీ వెంకట్రావు, అధికారులు

వారంలోగా జమచేయాలని, అలా జమచేయ్యకపోతే ఈసీ సోఫియాపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మృదులా, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్, ఎంపీపీ కాయల సౌందర్య, ఎంపీడీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించండి

● కలెక్టరుకు తల్లిదండ్రుల మొర

విడవలూరు, మార్చి 4: విద్యార్థులకు రవాణా సౌకర్యాలు సక్రమంగా లేక నానా ఇబ్బందులు పడుతున్నారని రామచంద్రాపురం, రామతీర్థం, దండిగుంట, వరిణి గ్రామాలకు చెందిన తల్లిదండ్రులు సోమవారం జిల్లా కలెక్టరుని కలసి మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామతీర్థం, వావిళ్ళ గ్రామాల్లో రెండు హైస్కూల్స్ ఉన్నాయని, అందులో సుమారు 80 మంది పిల్లలు తీరప్రాంత గ్రామాల నుంచి రోజూ ఆర్టీసీ బస్సులో వస్తుంటారన్నారు. అయితే బస్సు సకాలంలో రాకపోవటంతో విద్యార్థులు పాఠశాలలకు సక్రమంగా వెళ్లలేకపోతున్నారని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు ప్రత్యేకమైన రవాణా సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు.

పాలిటెక్నిక్‌లో శిక్షణ ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 4: నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి కోసం నిర్మించిన శిక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రూ.70 లక్షలతో ఈ కేంద్రాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించినట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వినీల్‌కుమార్ తెలిపారు.

ఓటర్లకు నేరుగా డబ్బులు ఇవ్వడమే అభివృద్ధా!

● మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 4: ప్రభుత్వాలు అభివృద్ధిని విస్మరించి ఓటర్లకు నేరుగా డబ్బులు ఇస్తే చాలు అనుకుంటున్నాయని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో 'ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సమాజాన్ని అభివృద్ధి చేసి సంపదను సృష్టించి



మాట్లాడుతున్న పల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ప్రజలకు ఉపాధి కల్పించడానికి బదులు నేరుగా డబ్బు పంపిణీ చేస్తే అదే అభివృద్ధి అని ప్రజలను నమ్మిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలో వచ్చేందుకు పార్టీలు డబ్బులు లేవనే భావనతో మంచి అభ్యర్థులను నిలబెట్టలేకపోతున్నాయన్నారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి పల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లను ఎన్నికల విధుల్లో ఉంచొద్దని ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఆ ఆదేశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ధిక్కరిస్తూ వలంటీర్లే తమ సైన్యం అని, వారి సహకారంతో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ విషయమై తాము హైకోర్టును ఆశ్రయించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవ్ డెమొక్రసీ అధ్యక్షుడు కోడూరు రవీంద్రరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకుడు జీ మాల్యాద్రి మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన కళాజాత ఆకట్టుకుందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 4: నగరంలోని బృందావనంలో త్రివేణి వైద్యశాల వెనుక వైపు సోమవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు.

వృద్ధుడిపై రౌడీషీటర్ దాడి

నెల్లూరు(క్రైం), మార్చి 4: తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని వృద్ధుడిపై రౌడీషీటర్ దాడి చేసిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. జేవీఆర్ఆర్ కాలనీలో రాజేశ్వరరావు నివాసం ఉంటున్నారు. ఆదివారం ఆయన పనినిమిత్తం బయటకు వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహేష్ అడ్డుకున్నాడు. తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేవని చెప్పడంతో అతనిపై దాడి చేశాడు. బాధితుడు రాజేశ్వరరావు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు స్పందనకు 95 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), మార్చి 4: నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన'కు జిల్లా వ్యాప్తంగా 95 మంది ప్రజలు వచ్చి తమ సమస్యలపై ఎస్పీ డాక్టర్ కె తిరుమలేశ్వరరెడ్డికి ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షలు కాజేసే మోసగాళ్లను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. సైబర్ నేరాలు, అదనపు కట్నం కోసం వేధింపులు, ఆస్తి కోసం పిల్లలు చిత్రహింసలు పెడుతున్నారంటూ వచ్చిన తదితర ఫిర్యాదులను ఎస్పీ పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బుజబుజనెల్లూరుకు చెందిన శ్రీకాంత్ నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ కంపెనీని ఏర్పాటు చేసి సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.30వేల తీసుకొని ఉద్యోగాలు ఇచ్చారని, అయితే కష్టపడి పనిచేసిన తర్వాత జీతాలు ఇవ్వలేదని హరిత, వసీమ్, ఫిరోజ్, శివరామకృష్ణలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మొదటి నెల జీతం అడిగితే ప్రాజెక్టు పూరయిన తర్వాత చెల్లిస్తామని చెప్పి ఆరు నెలలు తర్వాత ప్రాజెక్టు ఫెయిల్ అయ్యిందని సాకు చూపి రాత్రికి రాత్రి కంపెనీ ఎత్తేశారని బాధితులు వాపోయారు. జీతంతోపాటు సెక్యూరిటీ డిపాజిట్‌లు సైతం తిరిగి ఇవ్వలేదని, ఎంతో మందిని మోసం చేసిన శ్రీకాంత్, అతని టీమ్‌పై చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	70
స్కిన్ చికెన్	232
స్కిన్‌లెస్	258
లేయర్	120

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6066
వెండి కిలో ధర	రూ. 72,900
వెండి ఒక గ్రాము	రూ. 74.90

రైళ్లలో చోరీల నివారణకు చర్యలు

నెల్లూరు(క్రైం), మార్చి 4: వేసవి కాలంలో రైళ్లలో దొంగతనాల నివారణపై ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సంయుక్తంగా చేపట్టాల్సిన చర్యలపై సోమవారం జీఆర్‌పీఎస్ సీఐ కె.భుజంగరావు తన కార్యాలయంలో సమీక్షించారు. రైళ్లలో నిఘా, తనిఖీలు చేపట్టాల్సి అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్‌పీఎఫ్ సీఐ వసంతరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎంలో పొగలు

ఉదయగిరి రూరల్, మార్చి 4: స్థానిక కెనరా బ్యాంకు ఏటీఎంలో సోమవారం పొగలు వ్యాపించాయి. కమ్ముకున్న పొగతో అలారం మోగడంతో బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై పొగలను అదుపు చేశారు. ఏటీఎం మిషన్‌లో సాంకేతిక లోపంతో ఇలా జరిగినట్లు బ్యాంకు సిబ్బంది గుర్తించారు.

అభివృద్ధి పనులు పూర్తయ్యేనా?


ఉత్తరముఖ గాలిగోపురంపై ఒరిగిన కలశాలు

● సా...గుతున్న ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయ పనులు
● పట్టించుకోని దేవదాయశాఖ ● ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు
● జలకూట క్షేత్రానికి పూర్వవైభవం వచ్చేనా...?

బిట్రగుంట, మార్చి 4: దక్షిణ భారతంలో రెండో తిరుమలగా పేరొందిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. ఆలయ అభివృద్ధి విషయంలో రాష్ట్రప్రభుత్వం ఆదరణ కరువైంది. అభివృద్ధి పనులను దేవదాయశాఖ మొక్కుబడిగా చేస్తూ, ఆలయ ఆదాయాలను దండుకుంటున్నదనే ఆరోపణలు ఉన్నాయి. అభివృద్ధి పేరుతో గతంలో దాతలు చేసిన పనులను తొలగించి, కొత్త దాతలతో పనులు చేయిస్తున్నారు. ఈ నిర్మాణాలు చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా నత్తనడకన సాగుతున్నాయి. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అట్టహాసంగా శ్రీవారి కోనేరు పునఃనిర్మాణ పనులు ప్రారంభించారు. అయినా ఐదు అడుగుల గోడ నిర్మాణం ఆగిపోయింది. కోనేటి పనులు ప్రారంభించగా, నీరు కలుషితం అవుతున్నాయన్న గ్రామస్థుల ఫిర్యాదు మేరకు వాటిని నిలిపివేశారు. కోనేరు నిర్మాణ పనుల అంచనా ఏటా రూ. కోటి పెరుగుతూ ఉండడం, పూర్తి అయ్యేందుకు ఆటంకంగా మారింది. ఉత్తరముఖ గాలిగోపుర కలశాలు ఒరిగి తొమ్మి


నిర్మాణంలో ఉన్న తూర్పు గాలిగోపురం

దేళ్లు పైబడినా, వాటికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి సరిచేసే విషయంలో దేవదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దేవదాయ శాఖ చర్యలు చేపట్టకపోతే సొంత ఖర్చుతో చేస్తానని పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ నాలుగేళ్ల క్రితం చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. ఆయన కూడా ఈ విషయాన్ని పూర్తిగా మరచిపోయారు. స్వామివారికి ప్రతి ఏటా ఆదాయం పెరుగుతున్నా, ఆలయ అభివృద్ధి మాత్రం జరగడంలేదు. స్వామి,అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు అసంపూర్తి పనులు చూసి ఆవేదన చెందుతున్నారు. 2023లో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రథం దెబ్బతింది. నూతన రథ నిర్మాణం చేస్తారా ? లేక మరమ్మతులు చేస్తారా ? అన్న విషయం ఇప్పటికీ స్పష్టత లేదు. రథం లేకుండా ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు ఎలా నిర్వహిస్తారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.


శ్రీవారి పుష్కరిణి

జూన్ 20న రెవెన్యూ డే

నెల్లూరు (హరనాథపురం), మార్చి 4 : జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో 81ని జారీ చేసిందని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి డానియల్ పీటర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు చేసిన సేవలను కొనియాడుతూ వారిని సత్కరిస్తారని పేర్కొన్నారు. రెవెన్యూ జీవో రావడానికి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. ఈ జీవో ఇచ్చిన ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 4 : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వారి నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వాటి


అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పరిష్కారంలో అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నిర్దేశిత గడువులోగా అర్జీల పరిష్కారం జరిగిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, డీపీవో సుస్మితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● విడవలూరు మండలంలోని మత్స్యకార గ్రామాలకు పాఠశాలల సమయానికి బస్సులు నడపాలని కోరుతూ బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పొన్నపూడి పట్టపుపాళెం కేంద్రంగా పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం సరిగా లేనందున బాలబాలికలు పాఠశాలలకు నడిచి వెళుతున్నారని తెలిపారు.

● జీజీహెచ్‌లో క్రోనోకార్పస్ చెట్లను తొలగించాలి

నెల్లూరు(వైద్యం) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో అనారోగ్యానికి కారణమైన క్రోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ సింహపురి చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాబీభగత్ కలెక్టర్ హరినారాణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఊపిరితిత్తులను దెబ్బతీసే ఈ క్రోనోకార్పస్ చెట్లను తొలగించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌లకు వినతిపత్రం అందించినా పట్టించుకోలేదన్నారు.

ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో వసతులు కల్పించండి

నెల్లూరు(వైద్యం), మార్చి 4 : ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జరిగిన ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో చేపట్టాల్సిన పనులను గుర్తించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఏసీలు, వాషింగ్ మెసిన్, ప్రొజెక్టర్లు తదితర పరికరాలను దాతల సహకారంతో సమకూర్చుకోవాలన్నారు. ఆసుపత్రిలో సైన్ బోర్డులు ఏర్పాటు, పర్నిచర్, మరుగుదొడ్ల మరమ్మతులు, తలుపులు ఏర్పాటు, ప్లంబింగ్ తదితర పనులను పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సుధాకర్‌గౌడ్, డీఈ సాంబశివరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, ఏవో శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేత అడ్డగోలు దోపిడీ

● అసంపూర్తిగా ఇళ్లు.. లబ్ధిదారుల ఆవేదన

తోటపల్లిగూడూరు, మార్చి 4: అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు పక్కా గృహాలు కూడా నిర్మిస్తామని చెప్పిన అధికార పార్టీ నేతలు కొందరు లబ్ధిదారులకు మొండిచేయి చూపిస్తున్నారు. అంతేగాక అందినకాడికి దోచుకుని తింటున్నారు. వివరాల్లోకి వెళితే వరిగొండ పంచాయతీ జగనన్న కాలనీలో స్థానికంగా ఉన్న గిరిజనులకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఇళ్ల స్థలం ఇచ్చి 45 గృహాలు మంజూరు చేసింది. ఇల్లు కట్టుకోలేని వారికి అధికార పార్టీ కీలక నేత ఇళ్ల నిర్మాణ బాధ్యతలు తీసుకుని లబ్ధిదారులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేస్తానని చెప్పడంతో గిరిజనులు సంబరపడ్డారు. కానీ 15 ఇళ్లను పునాదులలోనే నిలిపివేశారు. ప్రభుత్వం బేస్మెంట్ వరకు నిధులు మంజూరుచేసి లబ్ధిదారుల ఖాతాల్లో వేసింది. దీంతో అధికార పార్టీ నేత వారిచేత డ్రాచేయించి 15 మందిలో కొందరికి రూ.49వేలు,


అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలు

మరికొందరికి రూ.57వేలు చొప్పున తీసుకున్నారు. అంతేగాక 40 బస్తాల సిమెంటు, ఇనుము, కాంక్రీట్ కూడా ఆ నాయకుడికే లబ్ధిదారులు అందజేశారు. ఇవన్నీ స్వాహా చేసిన ఆ కీలక నేత ఆ ఇంటి నిర్మాణాలను గాలికి వదిలేశారు. దీంతో గత సంవత్సరం నుంచి ఆ నేత ఇంటి చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణ చేస్తున్నా వారి మొర ఆలకించకపోగా, వారి అనుచరులతో బెదిరింపులకు గురిచేస్తున్నాడని బాధితులు వాపోతున్నారు. ముఖ్య ప్రజాప్రతినిధి పేరును వినియోగిస్తూ ఇదంతా చేస్తున్నారని లబ్ధిదారులు కన్నీరుమున్నీరవుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్, మంత్రి స్పందించి న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియపరుస్తా..

లబ్ధిదారుల సమస్యను ఉన్నతాధికారులకు తెలియపరిచి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని గృహనిర్మాణ శాఖ డీఈ సుబ్రహ్మణ్యం తెలిపారు.

- సుబ్రహ్మణ్యం, డీఈ, గృహనిర్మాణ శాఖ

తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శిగా అలేఖ్య

కావలి, మార్చి4: తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శిగా కావలి మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్యను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడి నుంచి సోమవారం ఆదేశాలు వచ్చాయి. మున్సిపల్ మాజీ ఛైర్మన్ స్వర్గీయ గ్రంధి యానాదిశెట్టి కుమార్తె అయిన అలేఖ్య గత టీడీపీ ప్రభుత్వంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్టారెడ్డితోపాటు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ తదితరులు అలేఖ్యకు అభినందనలు తెలిపారు.



అత్తపై కోడలు దాడి

అల్లూరు, మార్చి 4 : అత్తపై కోడలు దాడి చేయగా,ఈ ఘటనపై పోలీసు స్టేషనులో కేసు నమోదైంది. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు, అల్లూరుకు చెందిన ఈగలపాటి చెంచమ్మ తనకు ఆస్తి ఇవ్వలేదని ఆమె కోడలు ఈగలపాటి మంజుల దాడి చేసినట్టు ఫిర్యాదు అందింది. ఫిర్యాదు మేరకు మంజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. బాధితురాలు చెంచమ్మ మాట్లాడుతూ తన పుట్టింటి నుంచి కొంత ఆస్తి సంక్రమించగా, కొంతకాలంగా తనను చూడకుండా కోడలు మంజుల వేధింపులకు గురిచేస్తున్నదన్నారు. ఈ క్రమంలో తనపై రాయితో దాడి చేయగా, ఫిర్యాదు చేశానని తెలిపింది. తనకు రక్షణ కల్పించమని ఆమె కోరింది.

విద్యుత్ సిబ్బంది సేవలు కీలకం


పురస్కారాలు అందజేస్తున్న ఎస్ఈ విజయన్

● ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), మార్చి4 : విద్యుత్ సంస్థ మనుగడ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో విద్యుత్ సిబ్బంది సేవలు ఎంతో కీలకమని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లో సోమవారం లైన్‌మ్యాన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వ్యవస్థ బలంగా ఉండడానికి కారణం కిందిస్థాయి సిబ్బంది సేవలేనని పేర్కొన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నగర ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ సమయాల్లోనే కాకుండా ప్రకృతి వైపరీత్యాల సమయాల్లోనూ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు లైన్‌మెన్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఈలు మధుసూదన్‌రెడ్డి, కిరణ్, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోపై విచారణ జరపించాలి

● కలెక్టరేట్ ఎదుట యానాదుల సంక్షేమ సంఘం ధర్నా

నెల్లూరు(హరనాథపురం), మార్చి 4 : ఐటీడీఏ పీవోపై విచారణ జరిపించాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ నిధుల దుర్వినియోగానికి పాల్పడి అవినీతికి కేరాఫ్‌గా మారిన నెల్లూరు ఐటీడీఏ పీవోపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆగస్టులో జరిగిన ఆదివాసి దినోత్సవ సభలో భోజనాలకే


ధర్నా చేస్తున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

రూ.4.30 లక్షలు ఖర్చు చేశారని ఆరోపించారు. పీవో అవినీతి, నిధుల దుర్వినియోగానికి సంబంధించి పూర్తి ఆధారాలను కలెక్టర్‌కు సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్రబాబు, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, మల్లిక ప్రభావతి, రాపూరు నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

● దళిత సంఘర్షణ సమితి ఆందోళన

నెల్లూరు(హరనాథపురం), మార్చి 4 : హత్యాచారాలకు గురైన దళిత, గిరిజన బాలికలకు పోక్సో యాక్ట్, ఎస్సీ ఎస్టీ చట్టాల ద్వారా ఇచ్చే నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి మాట్లాడుతూ ఆ నిధులను ఇతర పథకాలకు ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. ఆ చట్టాలకు గురైన బాలికలకు ఇచ్చే నష్టపరిహారం ఇవ్వకపోగా, ఆరు నెలల కిందట మంజూరైన రూ.36 లక్షలను ఇతర పథకాలకు ఉపయోగించుకోవడం తగునా జగనన్న అని ప్రశ్నించారు. జిల్లాలో ఆ చట్టాల కింద 52 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. బాధిత బాలికలకు వెంటనే నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయ రత్నం, కోవూరు బాబు, చౌటూరి వెంకట రత్నం, ఇండ్ల రమణ, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో 99.85 శాతం

● రెండవ రోజు ఇంటింటికి...

నెల్లూరు(వైద్యం), మార్చి 4: పల్స్ పోలియో కార్యక్రమం రెండవ రోజు సోమవారం కూడా కొనసాగింది. జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 2,93,536 మంది ఉండగా 2,87,772 మందికి పోలియో చుక్కలు వేసి 99.85 శాతం పూర్తి చేశారు. మొదటి రోజు ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో 98.02 శాతం మందికి పోలియో చుక్కలు వేశారు. రెండో రోజు వైద్య సి బ్బంది, నర్సింగ్ సిబ్బంది ఇంటింటికి తిరిగి 5,366 మంది (1.83 శాతం) చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. వైద్య ఆరోగ్యశాఖ, వైద్యవిధాన పరిషత్ అధికారు లు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు.

చెక్‌పోస్టు సరే... సిబ్బంది ఏరి?

● పొదలకూరులో బోసిపోయిన బర్డ్‌ఫ్లూ చెక్‌పోస్టు



సిబ్బంది లేని బర్డ్‌ఫ్లూ చెక్‌పోస్టు

పొదలకూరు, మార్చి 4: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల బాయిలర్ కోళ్లు చనిపోవడంతో వాటి శాంపిల్స్ బోపాల్‌కి పంపి, బర్డ్‌ఫ్లూగా నిర్ధారించిన జిల్లా అధికార యంత్రాంగం నియంత్రణ చర్యలు చేపట్టిన విషయం విధితమే. ఇందులో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి బాయిలర్ కోళ్ల వాహనాలు పొదలకూరుకి రాకుండా గేట్ సెంటర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల ముందు మెయిన్ రోడ్డుపై బర్డ్‌ఫ్లూ చెక్‌పోస్టును శనివారం ఏర్పాటుచేశారు. అయితే చెక్‌పోస్టు ఏర్పాటు తర్వాత వాహనాల తనిఖీలు చేపట్టడం, కోళ్ల వాహనాల రాకపోకలపై నిషేధం విధించడం లాంటి చర్యలు చేయడం లేదు. విధులు నిర్వర్తించాల్సిన సిబ్బంది ఎవరూ మూడు రోజులుగా ఆ చెక్‌పోస్టులో ఉండడంలేదు. కేవలం షామియానాలు, కుర్చీలు తప్ప చెక్‌పోస్టులో ఎవరూ ఉండడం లేదని, వాటి బాడుగ దండగ అని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెక్‌పోస్టులో సిబ్బంది విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేట దర్గా.. పర్యాటక కేంద్రంగా మారేనా?

ఏఎస్ పేట, మార్చి4: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఏఎస్‌పేట దర్గా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని నాయకులు, అధికారులు చెబుతున్న మాటలు కలగా మిగులుతున్నాయి. ఎన్నికల వేళ పాలకులు వచ్చి పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇస్తున్నారే తప్ప అమలుకు నోచు కోవడం లేదు. దర్గాలో మొక్కులు తీర్చుకునేందుకు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతా నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర, ఉత్తరప్రదేశ్, అస్సాం, చత్తీస్‌ఘడ్ రాష్ట్రల నుంచి భక్తులు వస్తారు.అయితే ఈ దర్గాలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గ్రామంలో కనీసం బస్టాండ్, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. ఈ సమస్యతో దూర ప్రాంతాల యాత్రికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైౖ పాలకులు స్పందించి పేట దర్గాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.



ఏఎస్‌పేటలోని దర్గా

బాధితురాలికి ఆర్థిక సాయం

సీతారామపురం, మార్చి 4: పడమటి రొంపిదొడ్లకు చెందిన ఇర్ల చిన్నక్క గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అదే గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త బండ్ల హరికృష్ణ పార్టీ నియోజకవర్గ నాయకులు బోగినేని కాశీరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సోమవారం మహిళకు రూ.5వేలను అందజేశారు. వీరి వెంట పాలిశెట్టి శ్రీనివాసులు, కాశీ రత్నయ్య, శ్రీనివాసులు, అశోక్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయండి



ఆలూరి వెంకటసుబ్బయ్య

సీతారామపురం, మార్చి 4: మంగళగిరిలోని నాగార్జున యూ నివర్సిటీలో మంగళవారం జరిగే బీసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని తెలుగుదేశం కుమ్మరి శాలివాహన సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు ఆలూరి వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర అధ్యక్షతన జరిగే సభకు ముఖ్య అతిథులుగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో నారా లోకేష్ హాజరవుతారని చెప్పారు.

ఏపీపీకి అభినందనలు

ఉదయగిరి రూరల్: జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుకన్యకు సోమవారం పలువురు కోర్టు సిబ్బంది, పోలీసులు అభినందనలు తెలిపారు. శనివారం గుంటూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ సదస్సులో సుకన్య ప్రతిభ కనబ చూపింది. ఏజీ శ్రీరాం, హోం సెక్రటరీ సత్యప్రభాకర్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నట్లు చెప్పారు.

బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, మార్చి 4: సచివాలయం-1 యానిమల్ హాస్బెండరీ అసిస్టెంట్‌గా పఠాన్‌నాసిర్‌ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని చెప్పారు.

శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలి

ఉదయగిరి, మార్చి 4: ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. 17పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు హాజరై పంచాయతీల నిధులు, వాటి నిర్వహణ వినియోగం తదితర అంశాలపై అవగాహన చేసుకోవాలన్నారు.

గన్నేపల్లిలో వైద్యశిబిరం

ఉదయగిరి, మార్చి 4: గన్నేపల్లి పంచాయతీలో మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష రెండోవిడత కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ సోమవారం తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు ఆరోగ్య సురక్ష

వరికుంటపాడు: వేంపాడు సచివాలయ ప్రాంగణంలో మంగళవారం రెండోవిడత ఆరోగ్యసురక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలి పారు. ప్రత్యేక వైద్య నిపుణులతో రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితం గా మందులు అందజేస్తామన్నారు.

రాజవోలులో విజయీభవయాత్ర

ఏఎస్ పేట: రాజవోలుతోపాటు తాతిరెడ్డిపల్లి, పుట్టువారిపల్లిలో సోమవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి సమస్యలపై చర్చించారు.

94 మందికి పోలియో చుక్కలు

ఉదయగిరి రూరల్: పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా సోమవారం 94 మంది చిన్నారు లకు చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారిణి శివకల్ప న తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 4: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అంగన్‌వాడీలకు సామగ్రి పంపిణీ

ఉదయగిరి, మార్చి 4: ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో పచ్చవ లావణ్య సోమవారం ప్రాజెక్టు పరిధిలోని 173 మెయిన్, 35 మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన చాపలు, చీపుర్లు, బక్కె ట్లు, ఫినాయిల్, పోషణ బ్యాగులు, రికార్డులను అందజేశారు.

హెల్మెట్ తప్పనిసరి

చేజర్ల, మార్చి 4: మెటారు బైక్ ప్రయాణికులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపారు. సోమవారం మండలంలోని పలు ప్రాంతాల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. రెండు రోజుల కిందట ఆదురుపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో హెల్మెట్ లేకపోవడం వలనే తలకు తీవ్రగాయమై మరణించినట్లు తెలిపారు. వాహనాల పత్రాలను తప్పనిసరిగ్గా వెంట తీసుకరావాలన్నారు.

7న మండల సమావేశం

సీతారామపురం, మార్చి 4: ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 7న నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. సమావేశంలో తాగునీరు, విద్య, వ్యవసాయం, పంచాయతీరాజ్, గృహనిర్మాణశాఖలతో పాటు ఉపాధిహామీ పథకంపై సమీక్ష ఉంటుందని, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుడు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

భీమేశ్వరుడికి వైభవంగా శేషవాహనసేవ

సంగం, మార్చి 4: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా వంగల్లులోని కామాక్షిదేవి సమేత భీమేశ్వర స్వామి సోమవారం తెల్లవారుజామున శేషవాహనంపై గ్రా మోత్సవంలో ఊరేగారు. ఈ ఉత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూలంగిసేవ నిర్వహించారు.



శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

7న ఆత్మకూరులో జాబ్‌మేళా

ఆత్మకూరు, మార్చి 4: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 7న ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మ్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి విజయ వినీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీ నిర్వాహకులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే మేళాను ఎస్ఎస్‌సీ, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎస్‌కెఐఎల్ఎల్ యుఎస్‌ఐవీఈఆర్ఎస్ఈ.ఏపీఎస్ఎస్‌డీసీ. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మేళాలో పాల్గొనే వారు ఆధార్ జెరాక్స్, బయోడేటా తీసుకురావాలన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి రూరల్, మార్చి 4: పండ్ల తోటల పెంపకం చేపట్టే రైతులు తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాఖాధికారిణి జయశ్రీ తెలిపారు. సోమవారం ఉదయ గిరిలో సాగుచేసిన బత్తాయి తోటలను పరిశీలించి చెట్లకు బంక, ఇతరత్రా తెగుళ్ల సోకి ఉండడాన్ని గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వేరు కుళ్ల తెగుళ్లపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి దృష్ట్యా చెట్లకు నీటి తడులను ఏ విధంగా అందించాలో అవగాహన కల్పించారు. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో 1500 ఎకరాల్లో బత్తాయి సాగులో ఉందన్నారు. ఆమె వెంట వీహెచ్‌ఏ భరత్ పాల్గొన్నారు.



బత్తాయి చెట్లను పరిశీలిస్తున్న జయశ్రీ

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 4: రైతులు వరి పంట సాగు చేసి నష్టపో కుండా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ దొరసాని చెప్పారు. సోమవారం సోమలరేగడలో రైతు పెద్ది రెడ్డి వెంకట్రామిరెడ్డి నాలుగెకరాల్లో సాగు చేసిన ఆత్మ నెల్లూరు వారి ద్వారా వైఎల్ఎం-66 (శారద) అనే నువ్వు రకంను పంటను పరిశీలించారు. ఇతరరకాల కంటే శారద రకం పంట ఏపుగా పెరగడంతో ఎకరాకు 4-5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని గుర్తించారు. రైతులు రబీ సీజన్‌లో ఇతర పంటలు సాగు చేసి నష్టపోకుండా ఆధునిక వంగడాలను సాగు చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో డీపీడీ శివన్నారాయణ, ఏడీఏ చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, ఏఈవో సుధీర్‌కుమార్, వీఏఏలు పాల్గొన్నారు.



నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నిర్వహణ నిధులు లేక...

వరికుంటపాడు, మార్చి 4: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో 2014లో రూ.3లక్షల వ్యయంతో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభించిన కొద్ది రోజులు మాత్రమే అధికారులు వినియోగించుకున్నారు. నిర్వహణకు సంబంధించి నిధులు మంజూరు కాకపోవడంతోనే జనరేటర్ వృథాగా ఉన్నది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వినియోగం లేకుండా ఉంటే తుప్పు పడుతున్నది.



సంగంలో బీజేపీ ప్రజాపోరు యాత్ర

సంగం, మార్చి 4: ఎస్‌వీఆర్ పురం, సంగంలో సోమవారం బీజేపీ ప్రజాపోరుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. సంక్షేమ క్యాలెండర్లను ఆవిష్కరించి ప్రదర్శించారు. ఇం టింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. బీజే పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఏఎస్‌పేట మండల కన్వీన ర్ చెంచులురెడ్డి, చంద్రశేఖర్, మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.



సంక్షేమ కార్యక్రమాల క్యాలెండర్‌ను ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

ఉపాధి హామీ సిబ్బంది నిరసన

సంగం, మార్చి 4: న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సోమవారం మండల కార్యాలయంలో ఉపాధి సిబ్బంది మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యా డ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా సబ్‌కోర్టు వీధి


కావలి, మార్చి4: పట్టణంలోని సబ్ కోర్టు వీధి చెత్తా చెదారంతో నిండి, మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడ రెండు డంపర్‌బిన్‌లు ఉన్నా ఎప్పుడూ చెత్తాచెదారం రోడ్డుపై పడి ఉంటుంది. దీనికితోడు సమీపంలో ఇల్లు నిర్మిస్తున్న ఓ వ్యక్తి తన ఇంటి గోడలను నిత్యం నీటితో తడు పుతుండటంతో ఆ నీరంతా రోడ్డుపైకి చేరి చెత్తకుప్పల మీదుగా కిందకు వస్తుంది. దీంతో అక్కడ నీరు నిలిచి చెత్తంతా కుళ్లి కంపుకొడుతూ ఉంది. దీంతో రోడ్డుపై పడిన చెత్తను శుభ్రం చేయాలన్నా కార్మికులకు ఇబ్బందిగా ఉంది. మున్సిపల్ అధి కారులు స్పందించి ఆ వీధిలో పారిశుధ్యం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సబ్‌కోర్టు వీధిలో రోడ్డుపై పేరుకున్న చెత్త, పారుతున్న మురుగు నీరు

ఇందిరమ్మ కాలనీలో వెలగని వీధి దీపాలు

కావలి రూరల్, మార్చి4: స్థానిక ముసునూరు ఇందిరమ్మ కాలనీలో వెల గని వీధిదీపాలతో అంధకారం నెలకొంది. దివ్యాంగుల కాలనీ, చంద్రబాబునాయుడు కాలనీ, వినాయక కాలనీ, అట్టలఫ్యాక్టరీ కాలనీ తదితర ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగక పోవటంతో రాత్రిళ్లు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలు కంపచెట్లతో నిండి ఉండటంతో విష సర్పాలు సంచరిస్తున్నాయన్నారు. పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవటం లేద న్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగేలా చూడాలని వారు కోరుతున్నారు.



అట్టల ఫ్యాక్టరీ కాలనీలో వెలగని వీధి దీపం

పోర్టు నిర్వాసితులకు ప్యాకేజీ అమలు చేయాలి

● సాలిపేట ఎస్టీ కాలనీవాసుల ఆందోళన

కందుకూరు, మార్చి 4: రామాయపట్నం పోర్టు నిర్వాసితులైన సాలిపేట ఎస్టీ కాలనీ వాసులకు ఆర్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని ఆ కాలనీవాసులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టరు వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టరు జీ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు.కాలనీలో ఎస్టీలు, బీసీలు 102 కుటుంబాల వారు ఉండగా, అందులో 84 కుటుంబాలకు మాత్రమే ప్యాకేజీ ఇస్తామని జాబితా విడుదల చేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బతుకుదెరువు కోసం వలస వెళ్లినవారు నెలరోజులుగా సర్వేకోసం ఇక్కడే ఉంటున్నారని, వారి విషయంలో తక్షణం తగుచర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు సమగ్ర సర్వే చేపట్టి మిగిలిన 18 కుటుంబాలకు కూడా జాబితాలో చోటుకల్పించాలన్నారు. సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఆయా కుటుంబాలను కూడా జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకుంటామని, చనిపోయిన వారి స్థానంలో వారి వారసులకు ప్యాకేజీ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కర్లపాలెం సర్పంచి చాపల రమణయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు, సాలిపేట ఎస్టీ కాలనీవాసులు చేవూరి స్వామి, బాపట్ల కాలేషా, చెందేటి మస్తాన్‌రావు, జీవన్‌బాబు, రావూరి శేషయ్య, మానికల చెంచమ్మ, దాసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సాలిపేట ఎస్టీ కాలనీ వాసులు

మల్లన్నకు భృంగీశ్వర వాహన సేవ



కావలిటౌన్, మార్చి4: పాతూరులోని శివాలయంలో కుంభమాస తిరునాళ్ల సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి తొలిరోజు భృంగీశ్వర వాహనసేవ నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, హోమం పూజలు, బలిహరణ, పల్లకి సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో హైదరాబాద్ వాస్తవ్యులు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రిచే శివతత్వం ప్రవచనం జరిగింది.

రామానాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి




రామానాయడు ఇంటి వద్ద సోమిరెడ్డి తదితరులు

కలిగిరి, మార్చి 4: విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జొన్నలగడ్డ రామానాయుడు అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సిద్దనకొండూరులో రామానాయుడు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ప్రస్తుత రాజకీయ నాయకులంతా రామానాయుడును ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, చెరుకూరి వెంకటాద్రి, కల్లూరు చంద్రమౌళి, ఊసా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఉలవపాడు, మార్చి 4 : తహసీల్దార్‌గా ఏపీపీ చంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఆయన మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణను విజయవంతంగా నిర్వహిస్తామని ఆయన చెప్పారు. రైతుల ఆన్‌లైన్ పాస్ పుస్తకాలు, ఇతర రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు.



తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్రారెడ్డి

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా : బుర్రా

లింగసముద్రం, మార్చి 4: కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని కందుకూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బుర్రా మధుసూదన యాదవ్ తెలిపారు. సోమవారం స్థానిక వేముల అంజయ్య కల్యాణ మండపంలో వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. తొలుత ఆయన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.అనంతరం కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో గెలిపించి మళ్లీ సీఎం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, వైసీపీ కన్వీనర్ పీ తిరుతిరెడ్డి, సర్పంచులు వంటేల శ్రీనివాసులు, డి మల్లికార్జున, కొలికి లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు. కాగా కార్యక్రమానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అనుచరులు అత్యధికులు హాజరు కాలేదు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, మార్చి 4: మండలంలోని వీఆర్ కోట సమీపంలోని మన్నేరులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో సోమవారం అర్ధరాత్రి మన్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనలో ఇద్దరు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పల్స్‌పోలియో తనిఖీ

బిట్రగుంట : బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు నిర్వహిస్తున్న ఇంటింటికి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్‌బాబు సోమవారం తనిఖీ చేశారు. మండలంలోని కడనూతల, జువ్వలదిన్నె గ్రామాల్లో సిబ్బందితో కలసి పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జువ్వలదిన్నె వైద్యులు రాజశేఖర్, రూట్ సూపర్‌వైజర్లు జాన్‌అంకయ్య, వసంత, ఆశా వర్కలు పాల్గొన్నారు.

సీనియర్ కాపునేత రమేష్‌బాబు మృతి

బిట్రగుంట : బోగోలు మండలానికి చెందిన రాష్ట్ర సీనియర్ కాపు నాయకుడు మెతుకు రమేష్‌బాబు (65) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. రమేష్‌బాబు భార్య మెతుకు రాజేశ్వరి రాష్ట్ర కాపు నాయకురాలు కావడంతో అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కావలి జనసేన పార్టీ నేత అళహరి సుధాకర్ రమేష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు నూరుద్దీన్, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ కూడా నివాళులు అర్పించారు. రమేష్ అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు

కావలి, మార్చి4: కావలి టీడీపీలో చేరికలు నిత్యం కొనసాగుతున్నాయి. సోమవారం 31వ వార్డు మాజీ కౌన్సిలర్ దామా కుసుమకుమారి ఆధ్వర్యంలో ఆ వార్డుకు చెందిన పలువురు మహిళలు టీడీపీలో చేరారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో వారికి క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆవార్డు నాయకులు దామా మాల్యాద్రి, మంచాల ప్రసాద్, జక్కంపూడి తిరుమలరావు, దార్ల మాధవి, మక్కెన హరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన 31వ వార్డు మహిళలు

● కావ్యను కలిసిన కాకర్ల

కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని సోమవారం ఆయన నివాసంలో ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. కావ్య స్వగ్రామం జలదంకి మండలం కాగా, ఆ మండలం ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో ఉంది.ఈ క్రమంలో వారిద్దరూ కొద్దిసేపు చర్చించుకున్నారు.

క్రీడా దుస్తుల బహూకరణ

కొండాపురం, మార్చి4: మండల పరిధిలోని కొమ్మి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం క్రీడాదుస్తులను గ్రామానికి చెందిన మన్నం వెంకటసుబ్బయ్యాసుజాత దంపతులు అందచేశారు. దాతల మనుమడు రిషిరామ్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో కేకు కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో 2 ఆనందరావు క్రీడా దుస్తులను అందచేసిన దాత వెంకటసుబ్బయ్య దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డేగ మహేష్, ఉపాధ్యాయులు గోగుల వేణుగోపాల్, సత్యవోలు అగ్రహారం పాఠశాల హెచ్‌ఎం కొండూరు భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో-2 ఆనందరావు

జయహో బీసీ సదస్సుకు తరలిరండి



సమావేశంలో పాల్గొన్న మధుబాబు, ఇతర బీసీ నాయకులు

కందుకూరు, మార్చి 4: టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం జరగనున్న జయహో బీసీ బహిరంగ సభకు బీసీ సోదరులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆపార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, ఇతర నాయకులు పిలుపునిచ్చారు. కందుకూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశమై సభపై చర్చించారు. గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జయహో బీసీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీసీలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో బీసీ నాయకులు ముచ్చు శ్రీను, నవిడిబోయిన వెంకటకృష్ణ, ముచ్చు వేణు, మహర్షి శ్రీను, గుమ్మా శివ, పాలుబోయిన శ్రీను, మధిర మధు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మవద్దు : సౌజన్య

కందుకూరు, మార్చి 4: నియోజకవర్గంలో శాంతిభద్రతల విషయంలో అసత్య ప్రచారాలను నమ్మవద్దని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య పేర్కొన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె పట్టణంలోని వాసవీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, కొత్తూరు వెంకటసుధాకర్, కోటా కిషోర్, పోకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య తదితరులు

చిల్లచెట్లతో నిండిన శ్మశానం

లింగసముద్రం : మండలంలోని వెంగళాపురం శ్మశానవాటిక చిల్లచెట్లతో నిండి వుంది. లోపలికి వెళ్లేందుకు ఉన్న బాటలో కూడా చిల్లచెట్లు మొలిశాయి. గత టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.10 లక్షలతో శ్మశానవాటికను నిర్మించిందని మండల టీడీపీ ఉపాధ్యక్షుడు ఎన్. నారాయణ చెప్పారు.ఇందులో ఎకరా బీసీలకు, అర ఎకరా ఎస్సీలకు, మరో అర ఎకరా ఎస్టీలకు కేటాయించారని తెలిపారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక చిల్లచెట్లను తొలగించక పోవడంతో మృతదేహాలను పూడ్చేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ విషయమై ఇటీవల అధికారులను కలిసి అడగ్గా, వారు పట్టించుకోలేదని గ్రామస్థులు పేర్కొన్నారు.సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



శ్మశానానికి వెళ్లే దారిలో మొలిచిన చిల్లచెట్లు

పరీక్ష సామగ్రి పంపిణీ

బిట్రగుంట : బోగోలు మండలం పాతబిట్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు నెల్లూరుకు చెందిన గీతామయి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధినేత తమ్మినేని పాండు సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సరస్వతి నమస్తుభ్యం కమిటీ చైర్మన్ మద్దులూరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులకు సామగ్రిని అందచేయడం అభినందనీయమని ఎంఈవో జయమ్మ అన్నారు.

కాకాణికి గుణపాఠం తప్పదు : సోమిరెడ్డి

ముత్తుకూరు: వచ్చే ఎన్నికల్లో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణికి తగిన గుణపాఠం తప్పదని మాజీ మంత్రి, టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కప్పలదరువు, తాళ్లపూడి గ్రామాల్లో సోమవారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టులో బొగ్గు నౌకలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు యువకుల కుటుంబాలకు రూ.50లక్షల వంతున పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజక వర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, గుమ్మడి రాజాయాదవ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూ రు మునిరెడ్డి, నాయకులు కోదం డయ్య, తదితరులు పాల్గొన్నారు.


ముత్తుకూరు : ఇంటింటికీ కరపత్రాలు ఇస్తున్న సోమిరెడ్డి


బుచ్చిరెడ్డిపాళెంలో పర్యటిస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 4: ప్రజలను అన్నివిధాలుగా మోసం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు రాను న్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని కోవూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నా రు. సోమవారం బుచ్చి నగర పంచాయతీలోని 5వ వార్డు పరిధిలో ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో భాగంగా ఆయన ఆ వార్డు నాయకులు జాఫర్, షబ్బీర్, శివకుమార్, హేమంత్‌లతో కలిసి పర్యటించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముస్లిం సామాజిక వర్గానికి కల్పించిన సంక్షేమ పథకాలన్నీ వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందని ఈసందర్భంగా పలువురు ముస్లింలు దినేష్ రెడ్డి ముందు వాపోయారు. పలువురు బీడీ కార్మికులు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీ శేషయ్య, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, కొండయ్య, పురుషోత్తం, కల్యాణ్, శ్రీనివాసులు, ఉమామహేశ్వరరావు, మహేష్, సుబ్బారావు, రత్నం, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం

కొడవలూరు: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యం అని మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అన్నారు. మండలంలో గుండాలమ్మపాలెం గ్రామంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గం లో టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప ఎక్కడా అభివృద్ధి కనపడటంలేదన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పల్లరెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఆనంతో వీపీఆర్ భేటీ

నెల్లూరు(హరనాథపురం), మార్చి 4 : వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డితో సోమవారం ఆయన నివాసంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీపీఆర్‌కు రామనారాయణరెడ్డి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆనం రామనారాయణరెడ్డితో వేమిరెడ్డి

వీపీఆర్‌కు కోవూరు నాయకుల మద్దతు

కోవూరు నియోజకవర్గానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ మండపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా వీపీఆర్ నివాసానికి వచ్చి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గరికపాటి రాజేంద్ర, ఎస్సీసెల్ కొడవలూరు మండల అధ్యక్షుడు తువర ప్రవీణ్‌కుమార్, ఎం.రమణారెడ్డి, దిలీప్, సిద్ధార్థ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాలమహానాడు నాయకులు వీపీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, మాజీ ఎంపీటీసీ పుట్టా పద్మ పాల్గొన్నారు.

అక్రమ కొళాయిలు అరికట్టరా?

● అంబేడ్కర్ నగర్ వాసులు

నెల్లూరు(సిటీ), మార్చి 4 : ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చల విడిగా అక్రమ కొళాయిలు వేస్తుంటే కనీసం పట్టించుకోరా అని దర్గామిట్ట ప్రాంతంలోని అంబేడ్కర్ నగర్ వాసులు ప్రశ్నించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆ ప్రాంత వాసులు ఆర్ అనిల్‌కుమార్, చిన్నతోపాటు స్థానికులు ఇంజనీరింగ్ అధికారులు, ఫిట్టర్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. టెలిఫోన్ క్వార్టర్స్ ఎదురుగా అనధికార కొళాయిలను వేస్తున్నారని, దీని వల్ల పక్క ఇళ్ల వారికి నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ఫిట్టర్ ఒక్కో కొళాయికి రూ.25 వేలు తీసుకుని అనధికారికంగా డిస్ట్రిబ్యూటర్ లైన్ల నుంచి నివాసాలకు కనెక్షన్ లాగుతున్నారని ఆరోపించారు. ఇలా అనధికార కొళాయిల వల్ల అధికారికంగా ఉన్న లైన్లకు నీటి సామర్థ్యం తగ్గుతోందని వాపోయారు. ఈ విషయమై అనేక సార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో నగర వాసుల నుంచి 30 వినతులను ఏడీసీ స్వీకరించారు.


అంబేడ్కర్ నగర్‌లో వేసిన అనుమతిలేని కుళాయి పైపులైన్లు

బీసీలకు టికెట్ల కోసం టీడీపీపై ఒత్తిడి పెంచండి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 4 : బీసీలకు టికెట్ల కోసం టీడీపీపై ఒత్తిడి పెంచాలని బీసీ సంఘం రాష్ట్ర నేత ఒట్టూరు సంపత్‌రాజు సూచించారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం టీడీపీ జయహో బీసీ సభకు ఆ పార్టీలోని బీసీ నాయకులు, కార్యకర్తలు వెళుతున్నారన్నారు. చట్టసభల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలని ఉధృతంగా పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఆరు పార్లమెంటు స్థానాల పరిధిలోని 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు కేవలం రెండు సీట్లనే టీడీపీ బీసీలకు కేటాయించిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో పార్టీపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేయకుండా జయహో బీసీ అనటం సరికాదన్నారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలో వైసీపీ ఇప్పటికే రెండు సీట్లు బీసీలకు కేటాయించిందన్నారు. టీడీపీ ఒక్క సీటు కూడా ప్రకటించలేదన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్‌ఐ


పూల దుకాణదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ

పొదలకూరు, మార్చి 4 : ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పొదలకూరు స్టేషన్ నూతన ఎస్‌ఐ డీ రామకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని ఆటోడ్రైవర్లకు, దుకాణదారులకు సోమవారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటోడ్రైవర్లను స్టేషన్‌కు పిలిపించి మద్యంతాగి వాహనం నడపడం, సరైన పత్రాలు లేకుండా ఉండడం, ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడం, అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం లాంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంచాయతీ బస్టాండ్‌లో పూల దుకాణదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, స్థానిక ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 4: పట్టణంలోని రామకృష్ణానగర్‌లో వున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు శేష వాహనంపై బుచ్చి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలు స్వామి, అమ్మవార్లకు నివేదనలు సమర్పించుకున్నారు. ఉదయం ఆలయంలో ధ్వజారోహణం కార్య క్రమం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పండితులు, పాలకవర్గం పాల్గొన్నారు.


శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

కామాక్షితాయి సేవలో ఆర్‌జేసీ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 4: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయిని దేవాదాయ, ధర్మాదాయ శాఖ తిరుపతి ప్రాం తీయ సంయుక్త కమిషనర్ (ఆర్‌జేసీ) ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి సోమవారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్ర త్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో ఈఓ వి గిరికృష్ణతో శివరాత్రి పర్వదినం ఏర్పాట్లపై చర్చించారు. ఆయన వెంట ఆర్‌జేసీ కార్యాలయ సూపరింటెండెంట్ రామకృష్ణ వున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ


పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 4: స్థానిక బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ హైస్కూలు, విశ్వభారతి స్కూల్స్‌లో మాజీ ఎంపీపీ దొడ్డ విజయలక్ష్మి భర్త కోదండరామిరెడ్డి సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. దాతలు పొన్నలూరు సునీలమ్మ, చిన్నరెడ్డి వినత సహకారంతో పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం కోదండరామిరెడ్డిని హెచ్‌ఎం, ఉపాధ్యాయినులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పీవీ రత్నం, హైస్కూలు హెచ్‌ఎం సుజాత, రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాపూరు అభివృద్ధికి కృషి : నేదురుమల్లి

రాపూరు (డక్కిలి), మార్చి 4 : వెనుకబడ్డ రాపూరు ప్రాంతాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాపూరులో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకోన్నారు. కార్యక్రమంలో మేరిగ మురళీధర్ రావు, నాయకులు పాపకన్ను మధురెడ్డి, దయాకరరెడ్డి, నారాయణ రెడ్డి, పట్టాభిరామిరెడ్డి ఉన్నారు.

సీఆర్‌సీలో అంతర్జాతీయ వినికిడి దినోత్సవం

వెంకటాచలం, మార్చి 4 : మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్‌సీ)లో సోమవారం అంతర్జాతీయ వినికిడి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వినికిడి లోపం ఉన్నవారికి వినికిడి యంత్రాలను అందించారు. కార్యక్రమంలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు, సీఆర్‌సీ సంస్థ డైరెక్టర్ మనోజ్‌కుమార్, బి శ్రీకాంత్, జీ రామాంజనేయులు, సీఆర్‌సీ ప్రతినిధులు తదితరులున్నారు.

ఘనంగా జాతీయ భద్రతా వారోత్సవాలు

ముత్తుకూరు, మార్చి 4 : స్థానిక పైనంపురం సమీపంలో స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సం స్థల్లో ఒకటైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సం స్థలో సోమవారం 53వ జాతీయ భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ కార్యకలాపాలు, నిర్వహణ అధిపతి సునీల్‌కుమార్ గుప్తా హాజరై కార్యస్థలంలో భద్రత ప్రాముఖ్యత గురించి వివరించారు. భద్రత విషయంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులు, సిబ్బందికి అవార్డులు ప్రదానం చేయగా ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో రాఘవ్ త్రివేది అభినందనలు తెలియజేశారు.



భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న సెయిల్ అధికారులు

టీడీపీ సీనియర్ నేతకు పరామర్శ

కోవూరు, మార్చి 4: అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక కొత్తూరు రోడ్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మనుబోలు మల్లారెడ్డిని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, బాలరవి, నాటకరాని వెంకట్, పొబ్బారెడ్డి మలికార్జునరెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులున్నారు.

క్రైస్తవులు, ముస్లింలు ఐక్యతతో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 4 : భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, కొన్ని మతోన్మాద శక్తులు మైనారిటీలపై దాడులు చేస్తున్నాయని, ఈ సమయంలో క్రైస్తవులు, ముస్లింలు ఐక్యతతో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సామాజిక వేత్త పల్లతాన్ థామస్ కోరారు. సోమవారం ఇండియన్ మెడికల్ కౌన్సిల్ హాలులో క్రిష్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం, క్రైస్తవులు, మైనారిటీల హక్కులు, సవాళ్లు, కార్యాచరణ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. జేఏసీ నాయకుడు కలివెల ఎలీషాకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎలాంటి త్యాగాలు చేయక ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, దాని అనుబంధ సంస్థలు మనురాజ్యాంగాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత మూలం రమేష్, సీపీఐ నేత రామరాజు, సీఐటీయూ నేత అజయ్‌కుమార్, ఏపీసీఎల్‌సీ నేత ఎల్లంటి వెంకటేశ్వర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 4 : నగరంలోని బాలాజీనగర్ సాయిదర్బార్ ప్రాంగణంలో మంగళవారం ఉదయం 5 నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు శ్రీపాండురంగస్వామి ఆనంద అగ్నిగుండ మహోత్సవం జరుగుతుందని సాయిదర్బార్ వ్యవస్థాపకుడు మధుసాయి, పండరి భజన గురువు లక్ష్మీసాయి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సముద్ర మంగళ స్నానం, కంకణధారణ, ధ్వజారోహణం, అగ్నిగుండం తవ్వుట, అగ్ని ప్రతిష్ఠ, పండరిభజన ప్రారంభం, ముత్తైదువ సాంగ్యం, జెండాలతో పండరి భజన, కోలాటం, శ్రీకృష్ణలీలలు, ఉగ్రనరసింహస్వామి దండకం, అగ్నిగుండం ప్రవేశం, నైవేద్యం, పూర్ణాహుతిలు జరుగుతాయని తెలిపారు.

దేవరపాళెంలో టీడీపీ ఫ్లెక్సీల చించివేత

నెల్లూరు రూరల్, మార్చి 4 : మండలంలోని దేవరపాళెంలో టీడీపీ ఫ్లెక్సీలను వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు ఆదివారం చించేశారు. ఇటీవల వేదగిరి క్షేత్రం చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీగా తనతో పాటు అనుచరులను టీడీపీలోకి ఆహ్వానిస్తూ జరిగిన సభకు ఫ్లెక్సీలు కట్టారు. వాటిని వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు కత్తులతో కోసి చించేశారని సురేంద్రరెడ్డి వాపోయారు. సోమవారం ఇదే దారిలో వెల్లంటిలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పర్యటన జరిగిన నేపథ్యంలో వీటిని చింపేశారన్న ఆరోపణలున్నాయి.


గ్రామంలో చించేసిన టీడీపీ ఫ్లెక్సీ

బ్రాహ్మణ సంఘాల మహిళా దినోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 4 : బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న బ్రాహ్మణ మహిళలకు సన్మానం చేస్తున్నట్లు జిల్లా ఐక్య వేదిక అధ్యక్షుడు మైలవరపు మురళీమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రంగాలలో రాణిస్తున్న మహిళలతోపాటు పదవీ విరమణ చేసిన మహిళలు తమ సేవా కార్యక్రమాల వివరాలు తెలియజేసి సన్మానం అందుకోవాలని తెలిపారు. తమ వివరాలు వేదిక అసోసియేట్ అధ్యక్షుడు రఘుకిషోర్ శ్రీకంఠ 93923 42326కు తెలియజేయాలని పేర్కొన్నారు.

టీడీపీ ఎన్నికల లీగల్ ప్రతినిధుల నియామకం

నెల్లూరు(లీగల్), మార్చి 4: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరఫున లీగల్ వ్యవహారాలు చూసేందుకు నెల్లూరు అర్బన్, రూరల్ నియోజక వర్గాలకు షేక్ రియాజ్ బాషా, షేక్ అన్వర్‌బాషాను నియమిస్తూ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

టీడీపీని ఆదరించండి

● రూరల్ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 4 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కోరారు. సోమవారం 34వ డివిజన్ ప్రగతి నగర్, ఏ, బీ బ్లాకుల తోపాటు సూర్యప్రకాష్‌కాలనీ, రామచంద్ర మిషన్ ప్రాంతాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే కోటంరెడ్డికి మద్దతు ఇవ్వా లని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సుజాతమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కోటంరెడ్డి కుమార్తెను ఆశీర్వదిస్తున్న మహిళ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మార్చి 4 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని కసుమూరు సమీపంలో ఉన్న మలుపు వద్ద సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్ ప్రాంతానికి చెందిన సుహెల్, మున్నా ఇద్దరూ మోటర్‌బైక్‌పై కసుమూరు దర్గాకు వెళ్లి తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా చింతలపాళెం సమీపంలో ఉన్న మలుపు వద్ద ఎదురుగా టిప్పర్ రావడంతో దాన్ని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కసుమూరులోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు.

మద్యం సీసాల స్వాధీనం

తోటపల్లిగూడూరు, మార్చి 4: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు మేరకు మల్లికార్జునపురం ప్రభుత్వ వైన్ షాపులలో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్న ఈదురు వినోద్ 25 మద్యం సీసాలతో సాలిపేట నుంచి తోటపల్లిగూడూరుకు వెళుతుండగా నిందితుడిని అరెస్టు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హార్మోన్ల సమతుల్యతపై అవగాహన

కోవూరు, మార్చి 4: స్థానిక గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం హార్మోన్ల సమతుల్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఏ సహజ మాట్లాడుతూ సమతుల ఆహారం తీసుకోనందువల్ల యువత సమస్యల్ని ఎదుర్కొం టున్నారని చెప్పారు. ఈ సదస్సులో కళాశాల కమిటీ కార్యదర్శి కే సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్, డైరెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర ఆలయానికి కుర్చీల వితరణ


కుర్చీలు వితరణ చేస్తున్న దాతలు

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 4 : నగరంలోని వాహబ్‌పేట ఉమామహేశ్వర స్వామి ఆలయానికి శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా భక్తుల కోసం దాతలు 50 కుర్చీలు వితరణ చేశారు. సోమవారం హరనాథపురానికి చెందిన రామరాజు నాగేశ్వరరావు రూ.25వేలు విలువ చేసే 50 కుర్చీలను దేవస్థానం ధర్మకర్తలు ఎస్‌సీ బాలాజీసింగ్, జీసీ ధర్మసింగ్, ఈవో బీ మల్లికార్జున్‌రెడ్డి, ఆలయ అర్చకులు రామావఝ్ఝల శ్రీనివాస శర్మకు అందజేశారు.


నేత్రదానం అనంతరం సర్టిఫికెట్ అందజేస్తున్న వైద్యులు

నేత్రదానం

మనుబోలు, మార్చి 4: మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన చప్రం కామేశ్వరమ్మ (90) అనారోగ్యంతో సోమవారం చని పోయారు. ఆమె కోరిక మేరకు బంధు వులు నెల్లూరులోని ప్రభుత్వ ఆసు పత్రిలో వైద్యులకు సమాచారం అందించగా వారు ఆమె నేత్రాలను సేకరించి భద్రపరిచారు. నేత్ర దానం చేసినందుకు బంధువులకు సర్టిఫికెటును అందజేశారు. కామేశ్వరమ్మను స్ఫూర్తిగా తీసుకొని నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.




వెండి అంబారీపై ఆది దంపతుల ఊరేగింపు



నేత్రపర్వం...ధ్వజారోహణం

శివనామస్మరణతో మార్మోగిన ముక్కంటి ఆలయం ● వెండి అంబారీపై ఆది దంపతుల పుర విహారం

శ్రీకాళహస్తి, మార్చి 4 : శ్రీకాళహస్తీశ్వరాలయ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ధ్వజా రోహణ వేడుక వేదోక్తంగా జరిగింది.మధ్యాహ్నం ప్రారంభమైన వేడుక సాయంత్రం వరకూ జరగ్గా భక్తుల శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది.ఉదయం స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్ర జలాలను ఆలయంలో చల్లుతూ శుద్ధి చేశారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లు వెండి అంబారీ వాహనంపై ఆశీనులయ్యారు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం ఆలయం నుంచి శివయ్య గోపురం, రాజగోపురం మీదుగా వాహనాల మండపం వద్దకు తీసుకువచ్చారు.పంచమూర్తుల ఊరేగింపు


ధ్వజారోహణ పూజలు

చతుర్మాడ వీధుల్లో కనులపండువగా సాగింది. అనంతరం పంచమూర్తులను స్వామివారి గర్భాలయం వద్ద ఉన్న స్వర్ణతాపడ ధ్వజస్తంభం వద్ద కొలువుదీర్చారు. అలాగే ఉమాదేవి సమేత చంద్రశేఖర స్వామి త్రిశూలానికి ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ధ్వజారోహణం చేసే కొడి దారాన్ని పురవీధుల్లో సాంప్రదాయబద్ధంగా ఊరేగించారు. కలశ స్థాపనతో వేదోక్తంగా సంకల్ప పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య హోమం, పూజాది కైంకర్యాలు నిర్వహించాక ధ్వజస్తంభానికి దర్భధారణ చేశారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య భక్తులు సమర్పించిన కొడి చీరలను ధవళ పతాకంతో కలిపి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజస్తంభానికి అధి రోహింపజేశారు.సాయంత్రం ఆరుగంటలకు ఆలయంలోని యాగశాలలో కలశస్థాపనతో విశేష పూజలు చేశారు. చతుర్మాడ వీధుల్లో వెలసిన నవ సంధి వినాయకులను శివపార్వతుల కళ్యాణానికి విచ్చేయాలంటూ క్షేత్రధర్మంగా అర్చకులు ఆహ్వానం పలికారు. రాత్రి వెండి అంబారీ వాహనంపై స్వామి అమ్మవార్లు పుర వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు.ముందుగా ప్రచార రథం, స్వాగత తోరణాలు, గొడుగులు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, వివిధ కళాకారుల వాయిద్యాలు, వేషధారుల ప్రదర్శనలు ఊరేగింపులో భక్తులను ఆకట్టుకున్నాయి.అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, ప్రధాన అర్చకులు, ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.ఉదయం ఊరేగింపులో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

నేడు భూత, శుక వాహన సేవలు

శివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం భూతరాత్రిని పురస్కరించుకుని భూత గణాలకు ఆధిపత్యం వహిస్తున్న పరమేశ్వరుడు భూత వాహనంపై, ఆయన దేవేరి జ్ఞానప్రసూనాంబిక చిలుక వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నారు. ఉదయం సూర్య ప్రభపై స్వామివారు, చప్పరంపై అమ్మవారు ఊరేగనున్నారు.

వెంకన్న సేవలో సమంత

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):సినీ నటి సమంత సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయం లోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన సమంతను చూసేందుకు యాత్రికులు ఉత్సాహం చూపారు. ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

దొంగ ఓట్లు వేసుకునేందుకే ఎస్పీ బదిలీ

మలికా గార్గ్ బదిలీపై టీడీపీ, జనసేన ఆందోళన

తిరుపతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్పీ మలికా గార్గ్ బదిలీపై విపక్షాలు మండిపడ్డాయి. వైసీపీ నేతల ఒత్తిళ్లతోనే బాధ్యతలు చేపట్టిన మూడు వారాలు కూడా కాకుండానే ఆమెను హఠాత్తుగా బదిలీ చేశారంటూ ఆందోళన చేపట్టాయి.టీడీపీ-జనసేన శ్రేణులు సోమవారం ఉదయం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసనకు దిగాయి. తిరుపతి ప్రశాంతతను కాపాడాలని, ఎస్పీ బదిలీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్న నినాదాలతో హోరెత్తించాయి. సమాచారం అందుకున్న పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను ఉపేక్షించబోదన్న అనుమానంతోనే సిన్సియర్ అధికారిగా పేరున్న గార్గ్‌ను అర్ధంతరంగా బదిలీ చేశారని మండిపడ్డారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆమె పార్టీలకతీతంగా పారదర్శకంగా పని చేయడం అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేదన్నారు.రాబోయే ఎన్నికల్లో కూడా దొంగ ఓట్లతో గెలవాలని భావిస్తున్న వైసీపీ నేతలు ఎస్పీ అడ్డుకట్ట వేస్తుందని భావించే బదిలీ చేయించారన్నారు. మరో నాలుగు రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటుండగా నిజాయితీ కలిగిన మహిళా పోలీస్ అధికారిని బదిలీచేయడం బాధాకరమన్నారు. ఆందోళన చేస్తున్న వారిలో 24మందిని అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు బైండోవర్ కేసులు పెట్టారు. మధ్యాహ్నం 2.30 గంటలపైన సంతకాలు తీసుకుని విడుదల చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, ఊకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, చినబాబు, కంకణాల రజనీకాంత్ నాయుడు, రుద్రకోటి సదాశివం, మునిశేఖర్ రాయల్, పెరుమాళ్ మధు, ఆముదాల తులసీరాం, కరాటే చంద్ర, మునిరామయ్య, వేణుగోపాల నాయుడు, జయకుమార్, ఆనంద నాయుడు, పూజారి రాజారాం, జనసేన నాయకులు రాజా రెడ్డి,



ముక్కు. సత్యవంతుడు, కొండ రాజా, దినేష్, రాజేష్, రుద్ర కిషోర్ తదితరులు ఉన్నారు. టీడీపీ నాయకులు రవినాయుడు, బ్యాంకు శాంతమ్మ, హేమ, అనిత, విశ్వనాథం తదితరులు వెస్ట్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సంఘీభావం ప్రకటించారు.

గంజాయి స్మగ్లింగ్‌లో ప్రజాప్రతినిధి హస్తం

- అరెస్టు చేస్తారన్న భయంతోనే ఎస్పీని బదిలీ చేయించారు
- బీజేపీ నేతల సంచలన ఆరోపణ

తిరుపతి (తిలక్‌రోడ్), మార్చి 4: గంజాయి స్మగ్లింగ్‌లో స్థానిక ప్రజాప్రతినిధి హస్తం వున్నట్లు ఎస్పీ విచారణలో బయటపడటంతో ఎక్కడ అరెస్టు చేస్తారో అనే భయంతోనే ఎస్పీ మలికా గార్గ్‌ను బదిలీ చేయించారని బీజేపీ అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన తిరుపతిని వైసీపీ నాయకులు గంజాయివనంగా మార్చేశారంటూ ధ్వజమెత్తారు. దొంగ ఓట్లు, గంజాయి స్మగ్లింగ్, టీడీఆర్ బాండ్ల అవినీతిపై ఎస్పీ మలిక గార్గ్ నివేదిక తయారు చేస్తోందని తెలిసి ఎక్కడా తనను అరెస్టు చేస్తారో అనే భయం, ఎన్నికలకు ముందు ఇవన్నీ జరిగితే వైసీపీకి చెడ్డపేరు వస్తుందనే ఆలోచనతో ఎస్పీని బదిలీ చేయించారని ఆరోపించారు. నిజాయితీగా పనిచేసినందుకే వైసీపీ ప్రభుత్వం బదిలీ బహుమానాన్ని ఒక మహిళా అధికారికి అందించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే వైసీపీ మాట విని ఓ ఐఏఎస్ అధికారి సస్పెండయ్యారని గుర్తు చేశారు.అధికార పార్టీ నాయకులు మాట వినకపోవడం ఓ కారణమైతే నిక్కచ్చిగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని పోలీసు యంత్రాంగానికి సమావేశాల్లో ఎస్పీ చెప్పడం వైసీపీ నాయకులకు మింగుడుపడలేదన్నారు.ఈ విషయంపై ముఖ్యమంత్రే జవాబు చెప్పాలన్నారు.బదిలీ చేసిన ఎస్పీని వెంటనే తిరిగి తిరుపతికి బదిలీ చేయాలని, లేకుంటే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే హైకోర్టుకు వెళతామని స్పష్టం చేశారు.బీజేపీ నాయకులు వరప్రసాద్, జీవన్, భాస్కర్, అజయ్‌కుమార్,శేఖర్,నాదముని తదితరులు పాల్గొన్నారు.


తిరుపతిని వైసీపీ నాయకులు గంజాయివనంగా మార్చేశారంటూ తులసిమొక్కను చూపుతున్న భానుప్రకాష్‌రెడ్డి



దొంగ ఓట్ల సూత్రధారులే మలికాను బదిలీ చేయించారు : టీడీపీ

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 4 : తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో లాగా రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి తొత్తులుగా ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించకోకతప్పదని టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ హెచ్చరించారు.సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడితో కలిసి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నిర్ణయాలు తీసుకునే ఎస్పీ మలికా గార్గ్‌ను ఏ కారణం చేత వైసీపీ నేతలు బదిలీ చేయించారో చెప్పాలని డిమాండ్ చేశారు.తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల కేసును తుదిదశకు తీసుకువచ్చే ప్రమాదం ఉందని గ్రహించిన అక్రమ ఓట్ల సూత్రధారులు సీఎంపై ఒత్తిడి తెచ్చి ఎస్పీని బదిలీ చేయించారని ఆరోపించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తమ పార్టీ నేతలపై అక్రమంగా రౌడీషీట్లు తెరవడంపై ఎస్పీకి వినతిపత్రం ఇవ్వడంతో ఆమె అక్కడి అధికారులను ప్రశ్నించారన్నారు.ఇదంతా తెలిసి వచ్చే ఎన్నికల్లో ఎస్పీ సహకరించరని పసిగట్టిన వైసీపీ నాయకులు ఆమెను మార్చేశారన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, లేనిపక్షంలో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు.టీడీపీ నాయకులు కృష్ణయాదవ్, వాసు, సందీప్, రంజిత్, లోకేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. విలేకరుల సమావేశం అనంతరం ఎస్పీ బదిలీకి వ్యతిరేకంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తమ పార్టీ శ్రేణుల వద్దకు వెళతారేమోనన్న అనుమానంతో ప్రెస్‌క్లబ్ వద్దే వెస్ట్ పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా నరసింహ యాదవ్, రవి నాయుడు తదితరులు రోడ్డుపై బైఠాయించారు.వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఆర్పీ 41ఏ కింద నోటీసులు ఇచ్చి పంపించారు.

నేడు ఎస్పీ బాధ్యతల స్వీకారం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4: తిరుపతి జిల్లా ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్ మంగళవారం బాధ్యతలు తీసుకోనున్నారు.20రోజుల క్రితం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మలిక గర్గ్‌ను రాష్ట్రప్రభుత్వం ఆకస్మికంగా బదిలీచేసి సీఐడీ ఎస్పీగా నియమించింది. ఆ స్థానంలో ప్రస్తుతం విజయవాడ శాంతి భద్రతల విభాగం డీసీపీగా పనిచేస్తున్న కృష్ణకాంత్ పటేల్‌ను తిరుపతి జిల్లా ఎస్పీగా నియమించింది.కృష్ణకాంత్ పటేల్ మంగళవారం ఉదయం 10-11 గంటల మధ్య బాధ్యతలు తీసుకోనున్నారు. వేకువనే జిల్లాకు చేరుకోనున్న ఆయన ముందుగా తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు తీసుకుంటారు.


ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

మేం చెబితేనే మీకు పదవులొచ్చాయి

అసమ్మతి నాయకులపై మంత్రి రోజా భర్త సెల్వమణి వ్యాఖ్యలు

పుత్తూరు అర్బన్, మార్చి 4: 'మా సమ్మతితోనే మీకు పదవులు వచ్చాయి. మండలం మొత్తం వద్దన్నా వడమాలపేటకు చెందిన వైసీపీ నాయకుడు మురళీధర రెడ్డిని జడ్పీటీసీ చేశాం. చక్రపాణిరెడ్డికి శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవికి లెటర్ ఇవ్వడంతో పాటు సీఎంవోలో కూడా చెప్పాం. నగరికి చెందిన కేజే కుమార్‌కు స్థానిక నాయకత్వానికి మధ్య కొంత అభిప్రాయబేధాలు ఉండడంతో ఆయనను రాష్ట్రస్థాయి పదవికి ఎంపిక చేయడంలో మా పాత్ర ఉంది' అని మంత్రి రోజా భర్త సెల్వమణి వ్యాఖ్యానించారు. ఆదివారం నగరిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మండల కమిటీల సన్మాన కార్యక్రమం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రి రోజా కూడా, ఏ రోజూ తాను వారి క్వారీ వ్యాపారాలకు అడ్డుపడలేదన్నారు.

తగ్గేదేలే!

శిలాఫలకాల తొలగింపుపై జిల్లా అధికారులకు జడ్పీటీసీ ఫిర్యాదు

వడమాలపేట, మార్చి 4:ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం, శిలాఫలకాల తొలగింపు వ్యవహారంపై వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మంత్రి రోజా అసమ్మతి నాయకుడు జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడమాలపేట మండలంలో గత ఆదివారం అప్పలాయగుంట, పత్తిపుత్తూరుల్లో పూర్తయిన సచివాలయ, ఆర్బీకే , పాలవెల్లువ భవనాలను నిబంధనల మేరకు ప్రోటోకాల్ జడ్పీటీసీ సభ్యుడిగా తాను ప్రారంభించినట్లు తెలిపారు. మంత్రి ఒత్తిడితో సంబంధిత పంచాయితీ రాజ్ శాఖ అధికారులు మూడు రోజుల తరువాత వాటిని తొలగించారన్నారు. ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశకు, ఏఎస్పీ కులశేఖర్‌కు, జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడిగా తనకు సమాచారం లేకుండా మళ్లీ అదే భవనాలను ఆర్భాటంగా మంత్రి రోజా ప్రారంభించారని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చెప్పారు.

టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర కమిటీలో జిల్లావాసులకు చోటు

తిరుపతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర కమిటీలో తిరుపతి నియోజకవర్గానికి చెందిన మహబూబ్ బాషా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీలో తిరుపతి నియోజకవర్గానికి చెందిన సీహెచ్ రామ్‌ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా, సత్యవేడు నియోజకవర్గానికి చెందిన కొండూరు బాలరాజు ఉపాధ్యక్షుడిగా, చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన బిరుదాల భాస్కర్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గానికి చెందిన ఎం.జయకుమార్‌లు ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం ఈ నియామకాలను ప్రకటించారు.

గురుకులాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

వెంకటగిరి, మార్చి 4: 2024- 2025 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 38 గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశానికి, 7 జూనియర్ బాలుర కళాశాలు, ఒక డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు వెంకటగిరి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కోఆర్డినేటర్ చౌదరి శారదాబాయి తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు హెచ్‌టిటిపిఎస్-ఎపిఆర్ఎస్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాకు సంబంధించిన విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీన తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాపస్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని 12 మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీలకు ప్రవేశానికి, మూడు జూనియర్ బాలుర కళాశాలల్లో ప్రవేశానికి మైనారిటీ విద్యార్థులు మే 1 నుంచి సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న సంధ్యారాణి

గూడూరు, మార్చి 4: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక సంయుక్త నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకశాలు కల్పించడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు మహాశక్తి పథకం ద్వారా పలు సంక్షేమ పథకాలను అమలు చేసేలా చంద్రబాబునాయుడు మినీ మెనిఫెస్టోను రూపొందించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, రవీంద్రరెడ్డి, ప్రవీణ్, తూపిలి సురేంద్ర, సుమన్, బిల్లు చెంచురామయ్య, సద్దాం, అమరయ్య, గుండాల లీలావతి, భారతి, లక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

తడ పోలీస్ స్టేషన్‌కు శిక్షణ ఎస్పీ

రెండు నెలలపాటు విధుల నిర్వహణ



దేవరాజ్ మనీష్‌పాటిల్

తడ, మార్చి 4: తడ పోలీస్ స్టేషన్‌కు ట్రైనీ ఎస్పీని అధికారులు నియమించారు. పోలీస్ స్టేషన్ వ్యవహారాలు, నిర్వహణ వంటి విషయాలపై అవగాహన కోసం 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన దేవరాజ్ మనీష్‌పాటిల్ ఇక్కడ నియమితులయ్యారని, ఆయన రెండు నెలలపాటు ఇక్కడ విధుల్లో ఉంటున్నట్లుగా స్థానిక పోలీసులు తెలిపారు. సోమవారం విధుల్లో చేరిన ట్రైనీ ఎస్పీ దేవరాజ్ మనీష్‌పాటిల్ రాష్ట్ర సరిహద్దులోని పన్నంగాడు, భీములవారిపాళెం వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్ఐ నరసింహారావు ఉన్నారు.

ప్రకృతి ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు



ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఏడీ గోపీనాయక్

గూడూరుఅర్బన్, మార్చి 4: స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు, స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా ఈ స్టాల్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఇందులో ఎటువంటి పురుగుమందులను వాడకుండానే పండించిన ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు తక్కువ ధరల్లో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో రమేష్, ఏపీఎం బుజ్జమ్మ, మధు, తిరుమల, కృష్ణయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాంకుమార్‌రెడ్డిని గెలిపించండి



సంగనపల్లి మహిళలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

డక్కిలి, మార్చి 4: తన కుమారుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. సోమవారం ఆమె మండలంలోని సంగనపల్లిలో పర్యటించారు. గ్రామస్తులను పేరు పేరునా పలకరిస్తూ.. మీకు గుర్తుందా మీ గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేసింది నేనే అంటూ గుర్తుచేశారు. 1992లో తన భర్త జనార్దనరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఆయన గ్రామానికి రావడానికి రోడ్డు సౌకర్యం లేక ఎంతో ఇబ్బంది పడ్డానని చెప్పారు. తానే భూసేకరణ చేయించి తారు రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రాంకుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, ఆయనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణలు తొలగించండి

వెంకటగిరిటౌన్, మార్చి 4: పట్టణంలోని అమ్మవారి పేట చెరువు భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని కౌన్సిలర్ ఆరి శంకరయ్య సోమవారం తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐదుగురి బైండోవర్

బాలాయపల్లి, మార్చి 4: సార్వత్రికల ఎన్నికల నేపథ్యంలో పాత కేసుల్లో నిందితులుగా ఉన్న ఐదుమందిని బైండోవర్ చేసుకున్నట్లు బాలాయపల్లి ఎస్ఐ మహబూబ్ సుభానీ సోమవారం తెలిపారు. వీరిని తహసీల్దార్ పుల్లరావు వద్ద హాజరు పరిచామని చెప్పారు.

వైసీపీలో చేరికలు

గూడూరు అర్బన్, మార్చి 4: పట్టణంలోని అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన పలువురు యువకులు సోమవారం వైసీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొమిడి శ్రీనివాసులు, కాంద్ర నారాయణరెడ్డి, మగ్దూం, తాళ్లూరు శ్రీనివాసులు, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి

కోట, మార్చి 4: మండల పరిధిలోని చెందోడులో విద్యుత్ తీగలు తగిలి మల్లి సోమయ్య(65) అనే రైతు ఆదివారం మృతి చెందారు. మండల పరిధిలోని ఊనుగుంటపాళెం గ్రామానికి చెందిన సోమయ్య చెందోడులో పొలాలను లీజుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఆదివారం వరి పంట కోసేందుకు కోత మిషన్ తీసుకెళ్తుండగా పైన విద్యుత్ తీగలు అడ్డు రావడంతో వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడు. విద్యుత్ తీగలు రైతుపై పడటంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కారు - బస్సు ఢీ: ఇద్దరికి స్వల్పగాయాలు

తడ, మార్చి 4: బస్సును కారు ఢీకొన్న ఘటన కొండూరు జాతీయ రహదారి వద్ద జరిగింది. శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు చెందిన బస్సు సోమవారం మధ్యాహ్నం సమయంలో ఉద్యోగులను తీసుకొని కొండూరు జాతీయ రహదారి వద్దకు వచ్చింది. అక్కడ ఉద్యోగులను దించేసి తిరిగి బయలుదేరింది. సమీపంలోనే బస్సును మలుపుతిప్పుతుండగా చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

వైసీపీ ప్రభుత్వాన్ని సముద్రంలో కలిపేయాలి: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల విజయశ్రీ

తడ, మార్చి 4: రాష్ట్రాన్ని దివాళా తీయించిన ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వాన్ని సముద్రంలో కలిపేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం స్థానిక సుజాత నగర్‌లో విజయశ్రీ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో 20 యేళ్లు వెనక్కు వెళ్లిపోయిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నా చంద్రబాబు మరోమారు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులంతా కలసికట్టుగా పనిచేసి విజయశ్రీ విజయానికి కృషిచేయాలని కోరారు. అంతకుముందు నెలవల విజయశ్రీకి తెలుగు తమ్ముళ్లు పూలవర్షంతో స్వాగతం పలికారు. బజారు కూడలి నుంచి సుజాత నగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, నాయకులు సెల్వం, వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, జయపాల్, సుదర్శన్ మొదలియార్, బొమ్మన పళణి, రవి, టీకే శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై రూ.12 లక్షల కోట్ల అప్పు: నెలవల

నాయుడుపేట, మార్చి 4: వైసీపీ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపిందని మాజీ ఎంపీ, టీడీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. దొరవారిసత్రంలో సోమవారం రాత్రి స్థానిక నేత సుదర్శన్ అధ్యక్షతన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల ఐక్యమత్యంగా పనిచేసి విజయశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన పళణి, సెల్వం, వరసుందరి, సుధాకర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, శశి, కళ్యాణి, వాసు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి పరిచయ కార్యక్రమం నిర్వమించారు. మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి విజయశ్రీని గెలిపించుకోవాలన్నారు. విజయశ్రీ మాట్లాడుతూ తనకు రాజకీయాలు కొత్తయినా టీడీపీ కుటుంబ సభ్యులందరూ ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, మాధవ నాయుడు, నెలవల రాజేష్, పార్థసారథి, సుజాత, భవాని, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, తిరుపాల్, బుజ్జిబాబు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు కలిసికట్టుగా పనిచేద్దాం: పాశం



ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 4: టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ - జనసేన అభ్యర్థుల ప్రచారం కోసం ఎన్ఆర్ఐ కొట్టే ఉదయ్ భాస్కర్ అందజేసిన 25 ప్రచార వాహనాలను సోమవారం దివిపాళెం గ్రామ సమీపంలో జెండా ఊపి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ - జనసేన ఉమ్మడి అభ్యర్థుల ప్రచారం కోసం ఎన్ఆర్ఐ ఉదయ్‌భాస్కర్ 25 వాహనాలను అందజేయడం అభినందనీయమన్నారు. టీడీపీ - జనసేన పార్టీల కలయికను రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటు అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కరిముల్లా, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, తీగల చంద్రశేఖర్, కొట్టే వెంకటేశ్వర్లు, అబ్దుల్‌రహీం, చంద్రమౌళి, పెంచలయ్య, నరసరాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరులోని టీడీపీ కార్యాలయంలో వాకాడు మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి సునీల్‌కుమార్ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోవిందయ్య, రమణయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దివిపాళెం ప్రాంతంలో పలువురు టీడీపీలో చేరారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గూడూరు అర్బన్, మార్చి 4: మండలం పరిధిలోని ఆదిశంకర కళాశాల సమీపంలో సోమవారం కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... బెంగళూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారును అదే మార్గంలో వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొంది. ముందువైపు మరో ఆర్టీసీ బస్సు ఆగివుండడంతో రెండు బస్సుల మధ్య కారు నుజ్జునుజ్జయింది. అయితే కారులో వెళుతున్న ఐదుగురికి ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుతోనే రామరాజ్య స్థాపన: కురుగొండ్ల



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మార్చి 4: చంద్రబాబులో రాష్ట్రంలో రామరాజ్య స్థాపన సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని 12వ వార్డు మల్లమ్మ గుడి వీధిలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిషత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందన్నారు. రాష్ట్రానికి విముక్తి కలగాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తోట కృష్ణయ్య, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, కాపా శ్రీనివాసులు నాయుడు, మంకు ఆనంద్, తాండవ చంద్రారెడ్డి, సుధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో కాంచన

గూడూరు, మార్చి 4: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో కాంచన అన్నారు. సోమవారం స్థానిక జీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న 13మంది విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కడివేటటి చంద్రశేఖర్, హెచ్ఎం మున్వర్‌బాషా, వ్యాయమ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, విజయలక్ష్మి, సుమనప్రియ, లత తదితరులు పాల్గొన్నారు.

6న ప్రత్యేక విద్యుత్ అదాలత్

గూడూరుఅర్బన్, మార్చి 4: స్థానిక గోగినేపురంలో విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఈనెల 6వ తేదీ ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఈఈ నరేంద్రరెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, సైదాపురం, రాపూరు, కలువాయి సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని అన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో, అధికారులు

సూళ్లూరుపేట, మార్చి 4: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో చంద్రముని ఆధ్వర్యంలో అధికారులు ఈవీఎం పనిచేసే విధానాన్ని రాజకీయ పార్టీ నాయకులకు వివరించారు. ఈవీఎం మిషన్‌లో తప్పులు జరిగే అవకాశం లేదని, గ్రామాల్లో కూడా అవగాహన కల్పించి అపోహలు తొలిగిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎన్నికల డీటీ పవన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

చిల్లకూరు: స్థానిక మండల కార్యాలయంలో సోమవారం తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో బీఎల్‌వోలు, పలుశాఖల అధికారులకు, సిబ్బందికి ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు ఉపయోగాలు, మాక్ పోలింగ్ ఏ విధంగా నిర్వహించాలని, ఈవీఎంల కనెక్షన్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, ఈవీఎంల ట్రైనర్ సుబ్రహ్మణ్యం, పలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈవీఎంల వినియోగంపై సెక్టార్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. తహసీల్దారు దేవరకొండ నాగరాజరావు, డిప్యూటీ తహసీల్దారు అల్లం మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు రసీదులు ఇవ్వండి



ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

వెంకటగిరి, మార్చి 4: సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రభుత్వ భూముల కోసం అర్జీలు పెట్టుకొన్న వెంకటగిరి మండల పరిధిలోని పెట్లూరు గ్రామస్తులకు రసీదులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ పెట్లూరు గ్రామంలో వందల ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. నిరుపేదలకు పంచాలని ఈ భూములు ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకొన్నా అధికారులు స్పందించడంలేదన్నారు. సచివాలయాల్లో ఇచ్చిన అర్జీలకు రసీదులు కూడా ఇవ్వకపోవడం సరికాదన్నారు. అధికారులు స్పందించకపోతే భూఆక్రమణ కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. అర్జీలు ఇచ్చిన వారందరికీ స్పందన రసీదులు ఇప్పిస్తానని ఎంపీడీవో నీలకంటేశ్వరెడ్డి చెప్పడంతో ధర్నా విరమించారు.

రాయితీపై సోలార్ ప్యానల్స్

గూడూరు, మార్చి 4: కేంద్ర ప్రభుత్వం రాయితీతో సోలార్ ప్యానల్స్ అందజేస్తుందని, ఆసక్తి ఉన్న వారు పోస్టల్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ మణిగంధన్ తెలిపారు. 1కేవీ, 2కేవీ, 3కేవీ సోలార్ ప్యానల్స్‌ను 40 శాతం రాయితీపై అందజేస్తారని చెప్పారు.

పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడులు

చిట్టమూరు, మార్చి 4: పేకాట, కోడిపందేల స్థావరాలపై పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఏకసిరి మంగళకండ్రిగ అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న ఎస్ఐ చిన్న బలరామయ్య సిబ్బందితో కలసి దాడులు జరిపారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆరూరు పెద్ద దళితవాడలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

షరా మామూలే..!

కలెక్టరేట్‌కు పోటెత్తిన బాధితులు

'స్పందన'కు వచ్చిన అర్జీలు 167



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4: తమ సమస్యలు పరిష్కరించాలని ఎప్పటిలాగే బాధితులు కలెక్టరేట్‌కు పోటెత్తారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 167 అర్జీలు అందాయి. వీటిల్లో అత్యధికంగా 133 అర్జీలు భూ సమస్యలపైనే ఉన్నాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ లక్ష్మీశతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, భాస్కర్‌నాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, దేవేంద్రరెడ్డి స్వీకరించారు. స్పందనకు వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

శ్మశాన స్థలం కోసం తిరుగుతూనే ఉన్నాం



వెంకటేశ్వర్లు

మా కాలనీలో ఎవరైనా చనిపోతే శ్మశాన స్థలం లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం కలుజు పరిసరాల్లో దహన క్రియలు నిర్వహిస్తున్నాం. శ్మశాన స్థలం కేటాయించి, రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఇకనైనా మా సమస్య పరిష్కరించండి.

వెంకటేశ్వర్లు, వర్ధనపల్లి ఎస్టీకాలనీ, వెంకటగిరి మండలం

సాగునీటి కాలువను కబ్జా చేశారు



చెంగల్రాయులు

మా మండలంలోని పత్తిపుత్తూరులో సాగునీటి కాలువను కొంతమంది ఎక్స్‌కవేటర్లతో పూడ్చివేస్తున్నారు. రైతులకు ఉపయోగపడే కాలువను పూడ్చివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోండి.

చెంగల్రాయులు, చింతకాల్వ, వడమాలపేట మండలం

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి



దేవేంద్ర

నాకు ఎడమకాలు పనిచేయదు. ఒక కన్ను దృష్టిలోపం ఉంది. అలాగే బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. సదరం సర్టిఫికెట్ 80శాతం ఇవ్వాలని తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. మీరైనా విచారించి సర్టిఫికెట్ ఇప్పించండి

దేవేంద్ర, అప్పలాయగుంట, వడమాలపేట మండలం

శంఖారావాన్ని విజయవంతం చేయండి

వెంకటగిరి, మార్చి 4: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పట్టణ, అన్ని మండలాల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శంఖారావం సూపర్ సిక్స్ కిట్లను పంపిణీ చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

చిల్లకూరు, మార్చి 4: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని జిల్లా చీఫ్ అగ్నిమాపక అధికారి రమణయ్య అన్నారు. సోమవారం మండలంలోని లింగవరం సమీపంలోని జిందాల్ పరిశ్రమలో జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, మన్నూరి, విల్సన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించిన విద్యార్థి



కార్తీకేయ

నాయుడుపేట, మార్చి 4: నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దేగల కార్తీకేయ కరాటే బ్లాక్‌బెల్ట్ సాధించాడు. వెంకటగిరిలోని వంకి పెంచలయ్య ఫంక్షన్ హాల్‌లో సోమవారం కార్తీకేయకు బ్లాక్‌బెల్ట్, సర్టిఫికెట్, ఐడీకార్డును అందజేశారు. కార్తీకేయను ఇన్‌చార్జి హెచ్ఎం సీహెచ్ సురేష్‌బాబు, చంద్రశేఖర్ తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

విజయశ్రీకి సన్మానం



విజయశ్రీని సన్మానిస్తున్న నేతలు

నాయుడుపేట టౌన్, మార్చి 4: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి విజయశ్రీని పార్టీ నాయకులు సన్మానించారు. ఇటీవల వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, రమణారెడ్డి తమ అనుచరులతో సోమవారం నాయుడుపేట పట్టణంలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీని శాలువాలుకప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ముత్యాలయ్య, సుబ్రహ్మణ్యం, బాబు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు గుర్తింపు కార్డులు ఇవ్వండి

వెంకటగిరిటౌన్, మార్చి 4: వెలుగొండ అడవుల కింద ఉండే గిరిజనలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు బతుకు తెరువు కోసం అడవుల్లో పండే ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకుని జీవనం సాగిస్తుంటారని అన్నారు. వారిపై అటవీశాఖ సిబ్బంది అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎఫ్‌వో భూములకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, కృష్ణారెడ్డి, గిరిజనలు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

బాలాయపల్లి, మార్చి 4: స్థానిక భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద ఉజ్వల పథకం కింద లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు పంపిణీ చేశారు.